# కాలాన్ని జయిస్తూ నేను

కవిత్వం



జ్వలిత

# కాలాన్ని జయిస్తూ నేను

కవిత్వం

Donated
by
Prof. Chekuri Rama Rao
HYDERABAD.

జ్వలిత

నిరుపమ సంజన ప్రచురణలు
ఇం నెం 15 21 130/2, బాలాజీ నగర్,
కూకట్ పల్లి, హైద్రాబాద్ 500 072

# KAALAANNI JAYISTU NENU

Telugu Poetry

894 82718
జ్వలిత కాలాన్ని

**JWALITHA**

First Edition Aug 2007

Publishers
**NIRUPAMA SANJANA PRACHURANALU**
**# 15 21 130/2 Balaji Nagar,**
**Kukatapally Hyderabad 500 072**

Acc No. 12255

For Copies
**Vishalandhra Book House, Bank Street, Hyderabad**
**and all its branches**
**Navodaya Book House, Kachiguda, Hyderabad**
**Prajashakti Book House, Chikkadpalli Hyderabad**
**Disha Book House, Chikkadpalli Hyderabad**


**JWALITHA (Smt. Vijayakumari Denchanala)**
SA. Telugu
Govt. High School,
Ramavaram Kothagudem 507 118
Cell 9989198943
email vijayakumari denchanala@yahoo com

C-21496

@ Poetess

90574
హైదరాబాద్ 500

Price
**Rs 50/**



# అంకితం

నా భర్త
శ్రీ తుంగతుర్తి జనార్ధనరావు గారికి

# నా గురించి నేనే

చాలామందివలెనే ఒక కట్టుకొయ్యకు నన్ను నేనే కట్టేసుకున్న ప్రాణిని నేను ఇది నా కవిత్వం కాదు అసలు నాకు కవిత్వం రాయడం రాదు కాని నేను నా పన్నెండు పదమూడవ ఏటి నుండి సాహిత్యం చదవడం ప్రారంభించాను అయితే 15వ ఏటి నుండి జీవితాన్ని చదవడం మొదలెట్టాను 1980 నుండి రాస్తున్నాను నాకోసమే

'అయితే ఈ పుస్తకమేమిటి?' అని మీరడగవచ్చు దానికి సమాధానం చెప్పేముందు ఒక విషయం చెప్తాను "ప్రకృతి కత్తి విసిరితే దానిని పట్టుకోడానికి రెండే మార్గాలు ఉన్నాయి పదునైన వైపు లేదా పిడివైపు " యిది ఒక పాత నానుడి ధైర్యంతో జీవించడమంటే కత్తిని పిడివద్ద పట్టుకొని మనకు ఉపకరించేలా ఉపయోగించుకోవడం

ఇప్పుడు ఈ పుస్తమెందుకో చెప్తాను ఇది ఒక బాధ, భయం, భ్రాంతి, ప్రయత్నం, ప్రయాస, కష్టం, నిష్ఠూరం, సుఖం, దుఃఖం, కల, కలయిక, పోరు, పోటీ, పలాయనం, పయనం వెరసి మొత్తం నేను ఈ నేను నా స్వంతం ఈ నేను నేను మాత్రమే కాదు కంటికి కనిపించిన దుఃఖం, చెవికి వినిపించిన శోకం, మనసును కదిలించిన గాయం, కలలను దోచుకున్న దోపిడి "ఏడుస్తూ ఏడుస్తూ నేర్చుకున్న నవ్వువంటి జీవితం" ఈ కవితా సంపుటి

ఇక్కడ ఒక చిన్న కథ చెప్తాను మీ అందరికీ తెలిసిందే కావచ్చు "ఒక రైతు దగ్గరున్న రెండు గాడిదలలో ఏది మొండిదో తెలుసుకోవాలని 15 అడుగుల తాడుతో రెంటినీ చెరో వైపు కట్టి 25 అడుగుల దూరంలో రెండు కుప్పల గడ్డిని పెట్టాడు ప్రతి గాడిద తనవైపున్న కుప్ప వైపు లాగుతుంది లాగి, ఈడ్చి ఈడ్చి, లాగి ఒకదానికొకటి ఊపిరి సలపకుండా చేసుకొని రెండూ చచ్చిపోతాయి"

ఆ గాడిదల్లానే నేనూ జీవితంలో ఎంతో విలువైన కాలాన్ని వ్యర్ధ పరుచుకున్నాను అయితే వాటికంటే భిన్నంగా బ్రతికేవున్నాను మనిషినని నిరూపించుకున్నాను (నా ఆలోచనలు, నా జీవన విధానం ఇవి రెండు గాడిదలు)

ప్రపంచం నాకు ఎంతో నచ్చిన పాఠశాల, సమాజం నాకు నచ్చని గురువు ఇంకేమున్నది జీవితం ఒక అత్యంత అద్భుతమయిన విచిత్ర ప్రయోగశాల, ప్రతిదినం పరిశోధనే

పరిశోధనలో భాగంగా ఎన్నో పరిచయాలు, ఎన్నో అనుభవాలు, ఎన్నో అనుమానాలు, ఎన్నో అవమానాలు, ఎన్నో భయాలు

అయితే జెల్లీ చేప మింగిన నత్తకు చిప్ప ఉండటం వల్ల చేప కడుపులో బ్రతికే వుంటుంది కాగా కొంచెం కొంచెంగా చేపను తింటూ చేప కడుపులో నత్త బ్రతికే ఉంటూ చివరికి చేప మాత్రం మాయం నేను నత్తను భయమనే జెల్లీ చేప నన్ను మింగింది యిప్పుడు నాకు ఏ భయమూ లేదు

నిర్భయంగా, నిర్భీతిగా సాగే ఈ జీవన యానంలో కళ్ళు స్వప్నిస్తూ, చెవులు శోధిస్తూ, హృదయం స్పందిస్తూ, మెదడు మేల్కొనే ఉంటూ నేను జీవించే ఉన్నాననటానికి ఋజువు ఈ పుస్తకం నేను రెండో టీనేజ్‌ను అనుభవిస్తున్నాను రెండో జీవితాన్ని ప్రారంభించాను ప్రపంచమంతా యిప్పుడు నాకొక వింత పాఠశాల

నాపని నేను కొంత చేశాను చేతిలో పుస్తకాన్ని పట్టుకున్న మీరు చెప్పాలి నేను చేసిందేమిటో

సెలవు యిప్పటికి జయించవలసిన కాలం యింకా ఉంది కదా

కొత్తగూడెం
10 08 2007

జ్వలిత

## నాతోపాటు ఎందరో...

నాకు జన్మనిచ్చి నాకీ అదృష్టం కలిగించిన నాతండ్రి బ్రహ్మయ్య, తల్లి ఈశ్వరమ్మకు నా జీవితంలో నిజమయిన భాగస్వామి అయిన నా భర్త జనార్ధనరావుగారికి, నా అత్తామామలు మాణిక్యమ్మ, రాఘవయ్యగార్లకు, దేవుడి ఆశీర్వాదాలయిన నా కూతురు నిరుపమ, కుమారుడు చైతన్యకు, వారికి బోనస్‌లయిన వారి జీవిత భాగస్వాములకు, కోడలిలా వచ్చి స్నేహితురాలయిన పద్మినికి, నాకు అద్భుత వరమయిన మనుమరాలు 'సంజన'కు, నా తోబుట్టువులైన సరళకుమారి, శ్రీనివాస్‌లకు.

ప్రతి అక్షరానికి ప్రోత్సాహమై ఒక్కొక్క కవితకు ఒక్కొక్కరు ప్రథమ పాఠకులుగా నిలిచిన నా మిత్రబృందానికి, సహ ఉద్యోగులకు

ఈ సంపుటి రూపు దాల్చటానికి వెనుక వుండి, వెన్నుదన్నుయిన గురువుగారు, ప్రముఖ కవి రామా చంద్రమౌళి గారికి,

మొదటిసారి కథను ప్రచురించి బహుమతికూడా యిచ్చి ప్రోత్సహించిన 'భూమిక' స్త్రీవాద పత్రిక, నా కవితలు ప్రచురించిన ఆంధ్రజ్యోతి, నవ్య పత్రికలకు, కౌముది, తెలుగు పీపుల్, ప్రజాకళా ఆర్గ్, ఆన్‌లైన్ పత్రికలకు కృతజ్ఞతలు.

– జ్వలిత

Ln. విజయకుమారి దెంచనాల
M.A., M.Ed., M.Sc (Psy), L.L.B.
పారా లీగల్ వాలెంటీర్, ఫామిలి కౌన్సిల్ మెంబర్

# కవితాక్రమం


| క్ర సం | | పేజి నెం |
|---|---|---|
| 1 | సబ్బున్న జాతుల ఆడది | 1 |
| 2 | సుదీర్ఘ హత్య | 4 |
| 3 | స్వంతరక్తంలో పరాయితనం | 5 |
| 4 | కార్పొరేట్ దాంపత్యం | 6 |
| 5 | అరువుకు కన్నొకటి | 8 |
| 6 | వంధ్యత్వం | 10 |
| 7 | వడిసెలరాళ్లు | 12 |
| 8 | పునాదుల అవసరం | 14 |
| 9 | జిల్లేడు పొదలు | 16 |
| 10 | మరణంలో జీవించు | 18 |
| 11 | వర్షసుందరి | 20 |
| 12 | ఎమర్జెన్సీ | 21 |
| 13 | బంధాలకు వేలాడుతున్న శవాలు | 22 |
| 14 | మౌనం | 23 |
| 15 | ఆమె ఆకాశం | 25 |
| 16 | ఉలిక్కిపడ్డ ఉరి | 26 |
| 17 | కొత్తకాని మరణం | 27 |
| 18 | ఉత్తమ ప్రేక్షకులం | 29 |
| 19 | గాంధీగారి కోతులు | 31 |
| 20 | అక్షరంలానే జీవిస్తా | 32 |
| 21 | వనమూలికను | 34 |
| 22 | మృత్యునాదం | 36 |
| 23 | బతుకమ్మ బతుకు | 38 |
| 24 | నేస్తమా | 40 |
| 25 | స్మృతి సంపద | 41 |
| 26 | గాజుల హేళన | 43 |
| 27 | చదవాలని వుంది | 44 |
| 28 | ఊహామృతం | 45 |
| 29 | ప్రశ్నల ప్రహసనం | 46 |
| 30 | మనవంతు ఎంత | 48 |
| 31 | మనోరాగం | 49 |
| 32 | సంజీవినిని ఎవరు తేవాలి | 50 |

| | | |
|---|---|---|
| 33. | నిఘా | 51 |
| 34. | మధురిమ | 53 |
| 35. | నాలో నేను | 55 |
| 36. | తల్లి | 57 |
| 37. | నా పాలిట పరబ్రహ్మం | 59 |
| 38. | ఉద్యమాల అవసరం | 61 |
| 39. | తిరోగమనం | 63 |
| 40. | కాలాన్ని జయిస్తూ నేను | 64 |
| 41. | అందమైన అబద్ధం | 66 |
| 42. | మృగం | 68 |
| 43. | బాలల దినోత్సవం | 69 |
| 44. | ఏదైనా ఎవరైనా | 71 |
| 45. | సమీనాలా ఎందరో | 72 |
| 46. | వంద/వంద=? | 74 |
| 47. | ఒక ముఖం - ఎన్నో ముసుగులు | 76 |
| 48. | శూన్య పరిపూర్ణలోకాన... | 78 |
| 49. | దేహాన్ని మనసుతో ధరించినపుడు | 79 |
| 50. | మృత్యుగుండం - ముదిగొండ | 81 |
| 51. | ఇప్పుడేది అవసరం..? | 83 |

# 1. సబ్బన్న జాతుల ఆడది

కొలిమి కాడికి బొగ్గులు నేను తేస్తే
కొలిమితిత్తి నా అక్క ఊదితే
కొలిమిల కర్రుకు అమ్మ సమ్మెటేసి సాగదీస్తే
సందేల దబ్బులు అయ్యచేతులబడ్డయి
'ఒక్కడి రెక్కాడితే
నలుగురి బుక్కలాడతన్నయ్'
అన్న నా అయ్య మాట
నా అమ్మను కూలిదాన్ని చేసింది

సంగండి చక్రం నే తిప్పితే
బండి ముంత బతుకు కుదిరింది
బండి పూటీలకు తొళ్ళు నే కొట్టి
బండి ఆకులకు నూలు కొట్టి
దొడ్డిరంపానికి అక్కాచెల్లెళ్ళం
చెరో పక్క మేం అయి
మా పసితనంతో కోస్తే
పొద్దు గూకేళ్ళ నా తండ్రి
సోయి తప్పేట్టు తాగినప్పుడు
అలిసిందెక్కడ, తాగిందెవరో తెల్వక
ఆకాశమోలె నోరు తెర్సి నిద్రపోయిన

పత్తి పాదాలతో
మెత్తగా మట్టి తొక్కి
చిట్టి చేతులతో నీళ్ళు కొట్టి
నల్లరేగడి మట్టి
అందమైన పట్వోలె మారేదాకా
నీరై, మట్టై, మంటై, వామై

సంతల బేరమాడేదాక మేం ఉన్నా
చక్రం తిప్పినందుకే రెక్కలిరిగినయంటె
ఎండల కుండలమ్మిన అమ్మ
కుమ్మరి వాముల బూడిదోలే
తెల్ల మొగమేసింది
అష్టకష్టాలతో చదివించలేం
అర్థాకలితో పెంచి ఓ అయ్య చేతిల పెట్టాలె
అంటే పరువు నిలుపుకుందుకు
పాచి పని చెయ్యనీకి
అమ్మ కొంగు చాటుంగ కదిలినం
పని మానెయ్ మనువు చేయాలంటే
పయిలమని చెప్పినట్టుండేది
పైసలీమని అడిగినట్టుండేది

వేన్నీళ్ళకు చన్నీళ్ళోలిగ నౌకరి మొదలెట్టి
చివరాఖరికి పానం నిలపనీకి
జీవనాధారం నేనయినంక
'అయ్య కిష్టం లేనిది
నీళ్ళెందుకు తాగుతవ్
అని కొడుకడగ బట్టె
నే నీళ్ళు తాగితేనే కదా నీకు పాలిచ్చేది
ఏం చెయ్యను మొదట్నించి
వానపామోలె తెగినకాడె
పెరగడం నేర్సుకున్నదాన్ని
బల్లి తోకోల్లె తెంపినప్పుడల్ల
పెరుగుతనేవున్న
పడ్డ ప్రతిసారీ లేత్తనేవున్న
నే చేత్తనేవున్న

కన్నందుకు నువు నాకేం చేసినవ్
అని కన్న బిడ్డ అడిగితే
పిల్లోలే కూనల నోట కర్సుకొని

అద్దె యిండ్లమ్మొట తిరిగిన
సాలోడు బట్టలమ్మినట్టు
అరువులు తెచ్చి బట్టలమ్మిన
"గద్దొచ్చె కోడి పిల్లాట" నిత్యం ఆడి
రెక్కల కింద దాచిన
గద్దలతో పోరాడిన
నీళ్ళ కోసం, నీడ కోసం
కూటి కోసం, కూలికోసం
ఎలుకోలె ఎలుగు లెంట, కలుగు లెంట
పోరు చేసిన

మగతనం విర్రవీగి
నన్ను తిరుగుబోతంటే
నన్ను కూలిదాన్ని చేసిందెవరు?
కొలిమిల కర్రు, కుమ్మరి కుండలు
చీర ముక్కలు
చివరికి నా చిలుక పలుకులమ్మినపుడు
నేనేడిదాన్ని? ఆడదాన్ని కాదా?
మీకు ఆస్తులతో, అస్థికలతో
అస్తిత్వంతో ఆకారాన్నిచ్చి ఆత్మనిచ్చింది
నేనే

అయ్యో ! నేనే కొడకా నీ అమ్మను
తల నేలకేసి నా ముందుకెళ్లి
పోబడ్తివి, రాబడ్తివి
నీ దోస్తుతో, నీ పెళ్ళాంతో, నీ బిడ్డతో
ఊసులాడేప్పుడు
నా బిడ్డవ్ నువ్వని మరిస్తైటా?

***

'ఆంధ్రజ్యోతి' దినపత్రిక వివిధ'
తేది 16 07 2007

## 2. సుదీర్ఘ హత్య

ద్వేషించడం దీర్ఘకాలం సాగే ఆత్మహత్య
మోసం చేయడం, భ్రమపెట్టడం సుదీర్ఘకాలం కొనసాగే హత్య
రక్తం రాదు, గాయం కనపడదు
నరకయాతన, మరణవేదన
హృదయక్షేత్రాన్ని స్నేహమనే నాగలితో దున్ని
ప్రేమ జలంతో తడుపుతున్నాను
నమ్మడం, అభిమానించడం, ఆరాధించడం, పంచడం ద్వారా
పెంచుకోడం మాత్రమే తెలుసు నాకు
'ప్రేమించడమే' నాకు తెలిసిన విద్య
నమ్మడం    నా బలహీనత
నవ్వడం    నా వ్యసనం
నమ్మకపు గింజలు నాటితే
అనుమానపు మొలకలొస్తున్నాయి
అవమానపు పూలు పూసి
వేదన పంటగా పండుతోంది
మానవత్వపు చేనును
వంచన పురుగులా తొలుస్తోంది
మృత్యుభయాన్ని భుజాలపై మోస్తున్నపుడు
చావుకు బతుకుకు తేడా ఏది?

అర్జంటుగా నా మనసుకు
ఒక కుబుసాన్ని తొడుక్కోని
అత్యవసరంగా గరళాన్ని కక్కాలి
అది నీకు ఔషదమై రోగం కుదర్చాలి
అమృతంలా నిన్ను 'అమరం' చెయ్యాలి

***

## 3. స్వంతరక్తంలో పరాయితనం

రాయి తగిలిన అద్దంలా కాపురాలు ముక్కలవుతున్నాయి
ముక్క ముక్కలో వికృతరూపాలు
వికటాట్టహాసపు ధ్వనులు
రక్షణ వలయమవ్వాల్సిన రక్తబంధాలు
స్వార్థపు రంగులు అద్దుకుంటున్నాయి

కుటుంబమంతా అందమే, మరి వికృతమెక్కడిది
దర్పణంలా ప్రతిబింబిచాల్సిన సమయం
కటకంలా వక్రీభవనమేమిటి?
రాతి తాకిడికి అద్దం ముక్కలయ్యిందా !
అదృశ్యపు దెబ్బలకు హృదయం పగుళ్ళు వారిందా !
రాయినేనే, కటకంనేనే, దర్పణం నేనే ఐతే
గుండె కవాటానికి అడ్డుపడేదేమిటి
కంటికి స్వార్థపు పొరల భేషజం
స్వంతరక్తంలో పరాయితనం
కుటుంబ బంధాలకు పోగులు సన్నబడ్డాయి
మానవ సంబంధాలు పలుచబడ్డాయి
వట్టిపోయిన గోవులు కబేళాలకు
బ్రతికి వున్న బంధాలు వృద్ధాశ్రమాలకు.. అంతే-

***

# 4. కార్పొరేట్ దాంపత్యం

మనిషిని మనిషిగా బతకనివ్వని
అదృశ్య మాయాజాలం
కుడి చేత యిచ్చి ఎడం చేత లాక్కుంటుంది
మబ్బులా వర్షించే మాయజలం
సూర్యుడు లేకుండానే ఆవిరైపోతుంది
ఎటునుండి వచ్చి ఎటు పోతుందో తెలియని స్వర్గానందం

బలుపో వాపో తెలియనివ్వని ఆర్థిక లబ్ధి
సుఖాల, విలాసాల తాయిలాలు
కుటుంబ గోడలకు బీటలు చేస్తూ
మనవతానుబంధాలపై
మార్మిక కుట్రలు

మనకు తెలవకుండానే మనం మాయమౌతూ
అమ్మా నాన్నలు లేని, రాలేని
పబ్బు, క్లబ్బుల వారాంతపు సరాదాలు
నాగరికత పరదా మాటున
"న్యూక్లియర్" కుటుంబాలకు అవార్డులు
"డేటింగ్ అలవెన్స్"తో వ్యభిచారానికి రివార్డులు
"కాల్ సెంటర్" ఉద్యోగంలో కాలం, విలువలతో పని ఏమిటి?

సూర్యచంద్రుల కాపురం రాత్రింబవళ్ళ స్నేహం
నాకు సూర్యోదయంతో బతుకు తెరువు
నీకు చంద్రోదయంతో సుఖం కరువు
దాంపత్యానుబంధం అమవాస్య కారుచీకటి
కోరికలను కంట్రోల్ చేసే "రిమోట్" ఐదంకెలవేతనం

గొఱ్ఱె బలిస్తే గొల్లోడికి లాభం

గ్లోబలైజేషన్‌లో విలాసాల ప్రలోభం
బహు భార్యాత్వం, బహు భర్తృత్వం కాని
మనసుకు ముసుగేసిన శరీరాల స్నేహం
మది పొక్కిలి చేసుకోడానికి
'కంప్యూటర్' మౌస్ పనికిరాదు.
వంటిపై బట్టకు కరువు
సంఘంలో విలువలకు కరువు
ఆనందానికి కొత్తర్థాలు చెప్పేపర్సుతో బరువు
"వెబ్ సెంటర్" చాలు ఆకలి తీర్చుకోటానికి

తెల్ల తోడేళ్ళు దేశ సంపదను కొల్లగొట్టే క్రమం
ప్రపంచీకరణ మాటున తెలివి తేటలను దోచుకుంటూ
సంస్కృతీ సంప్రదాయాలపై గుమ్మరించిన నల్లతారు
అందాల పోటీల్లో మన ముఖాన చల్లిన తెల్ల పౌడరు.

వెన్నెల జలకాలు, జాజుల జడలు
పాలు, మురిపాల పంపకాలు
ఊహాలోకాలలో స్వప్న శకలాలు

తాతలు, చిన్నాన్నలు, మేనత్తలు
"గెట్ టుగెదర్" లో మృగ్యమైన బంధుత్వం
కంటికి కనిపించని ఒంటరితనం
జనారణ్యాల మధ్య ఏకాంతపు భూతం
మనసు చుట్టూ రకరకాల గోడలు
శరీరాకృతిలో విశాలత్వపు "ఒబెసిటి"
పెంచి పోషించుకుంటున్న విష సంస్కృతి

స్వంత వారిలో పరాయితనం
అవసరాల అవకాశాలలో ప్రేమతనం
నేను ... ఒక నేనుగా
నీవు ... ఒక నీవుగా మిగిలి
'మనం' కాలేని దాంపత్యం

***

## 5. అరుపుకు కన్నొకటి

మనిషి బుద్ధికి చిలుము పట్టినట్లు
మానవత్వపు మెట్లకు పాకురుపట్టినట్లు
చాన్నాళ్ళ నుండి పేరుకు పోయిన నమ్మకాలు
మసీదుల్లో, మందిరాల్లో అసహాయపు పావురాళ్ళు
శాంతమో, మూఢమో, అసమర్ధమో
ప్రతిసారీ ఎక్కడెక్కడో నమ్మక ద్రోహంలా
బాంబు పేలుతూనే వుంది

గుక్క పట్టిన పిల్లవాడిని ఏమార్చేందుకు
చప్పట్లు కొట్టినట్టు
పట్టించుకోని తల్లి కోసం
కాళ్ళు నేలకు కొట్టినట్టు
మాట వినిపించుకోని భర్తపై కోపం
వంట పాత్రలై మోగినట్టు
సీరియల్లో మునిగిన భార్యకై
తలుపు విసిరి కొట్టినట్టు
ప్రజల దృష్టి మరల్చే ప్రభుత్వంలా
మనలను భయపెట్టే మతంలా
జనాలకు మత్తుపెట్టే ఛానల్‌లా
అప్పుడప్పుడు యింటి దొంగలా
బాంబు పేలుతూనే ఉంది
అమాయకులు బలి అవుతున్నారు

బస్సులు కాల్చబడుతున్నాయి
మసీద్‌కు దెబ్బ తగలగానే
మందిరం 'అబ్బా' అంటూంది
కోవెల దెబ్బ తింటే
మసీద్ 'అయ్యో' అంటూంది
యిద్దరికి కలిపి శఠగోపం పెడ్తుందెవరు
అల్లా ఆలకించడం లేదా - దైవం తిలకించడం లేదా
పత్రికలు మసిపూస్తున్నాయ - ప్రజలకు బూడిద మిగుల్తోంది
ఉమ్మడి శత్రువును వెతకడంలో - నే 'ముక్కంటి' నౌతా
సోదరా నీ కన్నొకటి అరువిస్తావా?
ఇంద్రునిలా శరీరమంతా కన్నులు నేనౌతా

***

(మక్కామసీదులో 18-05-07 న జరిగిన బాంబు ప్రేలుడు సంఘటనపై)

## 6. వంధ్యత్వం

సగటుది సామాన్యమయినది నా మనసు
నా బలం, బలహీనత కూడా నా మనసే
వర్జీనియా టెక్ అయినా విజవాడయినా
శ్రీలక్ష్మయినా    లక్ష్మి సుజాతయినా
ప్రేమ హింసారూపమెత్తింది అహాలను తృప్తిపరచలేదనేగా

బిగ్‌బ్రదర్స్ షోలో జాత్యంహకారం ముందు
వుదారత్వం విశాల పసిఫిక్ మహాసంద్రంలా ప్రదర్శించి
వైరస్ అవగాహన సదస్సులో ఆ పైత్యపు ముద్దులేంటి
ఆంధ్రలో సంతోషమయినా పరదేశంలో మరో చోట అయినా
హంతకులు ఆకాశంలో నుండి ఊడిపడ్డారా

ధృతరాష్ట్రునిలా, పుట్టుగుడ్డి కాదు గదా మనం
గాంధారిలా అపాదించుకున్న అంధత్వం మనది
యిందుకు లింగభేదం లేదు
చూపుకే కాదు మనసుకూ మనకెందుకులే అని ఉపేక్ష

తిరుపతి ప్రసాదంలా మనప్రేమలను
ఐ లవ్ యు రా అంటూ ఎస్ ఎమ్ ఎస్ ల్లో
ఎందరికయినా ప్రేమను పంచే స్వేచ్ఛ మనకుంటే
మన బుద్ధి అమీబాలా అనుక్షణం మారుతుంటే
ఆక్టపస్‌లలా అన్నివైపులా వేటమనదే
వైరస్‌తో పాటు హింసను పెంచే వటవృక్షాలు మనమే

ముద్దుల శిల్పా రిచర్డ్‌ల ప్రహసనానికి మీడియాల ప్రాధాన్యత
వలస జీవుల హత్యలపై వెలుగు చూడని వుదంతాలపై

వెలికి తీయడానికి ఎందుకు వంధ్యత్వం
నాలుగు గోడల మధ్య తలలెత్తే చిరుమొలకలు
సామూహిక హింస రూపుదాల్చడంలో మన పాత్ర ఎంత?
సరసాదేవి గులక రాయినంటూ
ఏ కొండలను పిండి చేయాలని
నైతిక విలువల పతనంలో మనమెంత?

వెలుగుతున్న భారతంలా
పావురమై ఎగురుతున్న శాంతిలా
మన మదిపండు ఘనీభవించి
చిదిమినా చెరిపినా ఏమిపట్టని
స్థితప్రజ్ఞత పొంది, మనది కాదులే
అనుకుంటే సరిపోయే

***

ప్రజాకళ అర్గో
జూన్ 2007

## 7. వడిసెలరాళ్ళు

పాలకంకులపై పైరపిట్టల అత్యాచారం
గుండె గోడల నిండా దిగ్గొట్టబడుతున్న అయిష్టపు చిత్రపటాలు
సమస్యల దిగుడు బావుల్లోకి
రాకపోకలు ఆశల ఖాళీ కడవత్తో
అనుభవాల చెత్తనూడుస్తూ, కాలుస్తూ
అలిసిపోతున్న అగ్నిగుండం
తూర్పు దిశన ప్రసవ వేదన ప్రతిదినం
విప్లవ కాంతులను విరజిమ్ముతున్న రుధిరం
మృత్యువుకు తప్పని బలత్కారం
ఆత్మహత్యా ప్రయత్నం
విశ్వాన్ని విషపూరితం చేసే
అంధ విశ్వాసపు వీచికలు
అత్యాశల రెక్కలతో విహాయసపు విహగం
ఇంద్రధనస్సు రంగులను తప్పులెన్నుతూ
కాలచక్రపు ముళ్ళు మొండి మొండిగా
అనంతానంత అరికాళ్ళకు గుచ్చుకొని
చట్టాల చట్రాలకు కొత్త మేకులు ఎన్నికొట్టినా
జరిగిపోతున్న నేరాలు, హింసలు
గట్టిగా చూడలేని కట్టుబోతులు
పళ్ళూడగొట్టబడిన మంత్రెగత్తెలు
పాలకంకులు యికపై

వడిసెల విసరడం నేర్చుకోవాలి
గుండెగోడలు అయిష్టాలను పెచ్చుల్లా రాల్చేయాలి
మేకులూడదీసి
మృత్యుభయాన్ని చావగొట్టి
జీవితపు అమృతాన్ని వగ్గుపట్టడానికి
తెగువను చుట్టుకొన్న అతివలు కావాలి
బలవంతంగా అబలను చేసినందుకు
ఓటమి రాళ్ళను వడిసెలతో విసరడానికి

***

'కౌముది కామ్'
తేది ఆగస్ట్ 2007

## 8. పునాదులు అవసరం

జీవితం అసిధార వ్రతం
నిత్యం సుడిగుండాల ఆవృతం
పరిష్కారాల ఆవిష్కరణల కలవరింపులు
శ్మశాన వైరాగ్యపు పలకరింతలు

నీ స్మృతుల దర్పణాల ప్రతిబింబాలు
అక్షర అక్షౌహిణి చిత్రాల ఆరంభాలు
నీ చుట్టూ కనిపించని నిలువెత్తు గోడలు
నీ నుండి విడివడి నిను బెదిరించే నీడలు

ప్రతినిత్యం ప్రతిక్షణం పరీక్షల పరిష్వంగం
బ్రతకడమే తప్పనిసరిగా అనిపించినపుడు
ఏ బ్రత్తుకో తేల్చని మనోవిహంగం
రెక్కతెగిన ప్రతిసారి మరోటి మొలవడానికి బల్లితోక కాదు గదా

స్వసంపర్కంలో మనోనేత్రం మూతపడి
నీకేం కావాలో నీకు తెలియనపుడు
ప్రపంచానికి ఏంకావాలో తెలిసేదేలా
రవికాంచనిది కాంచవలసిన బాధ్యత నీది
ఎన్‌కౌంటర్లకు సాక్ష్యానివి మందుపాతర్లకు మంత్రానివి
ఉద్యమాలకు ఊపిరివి ఎన్నో తేలని

వాల్మీకికి, వ్యాసునికి వారసుడివి
కాళిదాసు కవిత్వానికి జోడిస్తున్న పైత్యానికి ఆనకట్టవి

పేరు మరిచిన ఈగవలె ఈకారం పాడితే
సృజననుద్ధరించే ఓంకారావిర్భావం ఏది
పురిటి నొప్పులతో ప్రతిక్షణం మరణించు
మరుక్షణం జీవించే మరో ప్రసవమే నీవు
నీలో వైరాగ్యం దేశభవితకు దౌర్భాగ్యం
నీలో అలసత్వం సాంస్కృతిక బానిసత్వం
మండే మనసుకు ఆజ్యం అందించి
మనిషినే కాలంగా నిర్మించే యుగాదులకు పునాది నీవే

***

## 9. జిల్లేడు పొదలు

గొడ్లకాడ ఎడ్డోడు చెప్పిండు
గోలీలాడే ఎల్లిగాడు చెప్పిండు
ఈతకాడ ఈరిగాడు చెప్పిండు
గొర్లకాసే మల్లిగాడు చెప్పిండు
గుడికాడి ఫాదర్, బడిలపంతులోరు  అందరు చెప్పిండ్రు

మంచినీళ్ళ చెలిమెకాడి కాంతక్క
చింతచిగురు కోసెకాడ రామత్త
బట్టలుతికే కాడ కనకాడిన
చెవుల యిల్లు కట్టుకుని చెప్తనేవున్నా
మోదుగాకు కోసేకాడ చిల్కమ్మ
తునికాకు దూసేకాడ మల్లమ్మ
యిస్తర్లమ్మే కాడ మారవ్వ
పిడకలేసేకాడ సూరవ్వ    చిల్కకు చెప్పినట్టు చెప్పిన్రు

మావిడితోటకు కాపలున్న కాశీగాడు
చెక్క తెడ్డు చెక్కె చెలమయ్య
మంగలి మారోజు, చాకలి చెల్విగాడు
కుమ్మరి కుంటోడు గుచ్చి గుచ్చి చెప్పిండ్రు

గుడిమెట్ల కాడి గుడ్డోడు
సంతకాడి చెవిటోడు
నోరున్న ప్రతొక్కలు చెప్తనే వున్నరు
భద్రం పొల్లా అని, జరభద్రం పోరీ
పయిలం బిడ్డా   ఎట్లెట్లనో చెప్పిన్రు
మొదట్ల యినపడ్డయి   సమ్‌జే కాలే

తర్వాత యినపడ్డా కనపడట్లే కదా అనుకున్నా
ఆ తర్వాత కనపడ్డా కనపడ్డా సొంచాయించలే
నా కళ్ళకు పసితనంలోనే శుక్లాలు ముదిరినయి
నా చెవుల పదుచుతనపు జిల్లేళ్ళు మొలిచినయి
నా మెదడుకు పక్షవాతమొచ్చింది
నాతోలు మందమెక్కింద
జిల్లేదుపూల నవ్వులు చూసి మల్లెలని భ్రమిసిన
బొమ్మజెముళ్ళు చూసి గులాబి పొదలనుకున్న
నాభి చెట్ల విషం తెల్వక మోదుగు పూలని మురిసిన
నీ దోస్తాని నాకు కావాలంటే
నేనేందో తెల్వని నేను నిజమన్కున్న
గిప్పుడు మదిపండు చిదమబడి
మందారంలా రక్తమోడుతుంటె
ఎతలకు కూడ కతలొల్లె
కయితలల్లుదమంటె
కలం కదల్తలే
కండ్లు కమ్ముతున్నయి ఊటబాయిలోలె
చేతులు కాలినంక ఆకులెదుకుడెందుకు
ఎయిడ్స్ వచ్చినంక ఏడ్సుడెందుకు
జర జనం చెప్పేదేందో వినుండ్రి
యిన్నా, మనసుకెక్కిచ్చుకొండ్రి
యింతకన్న ఏం చెప్పను
చెప్పినప్పుడు యిననైతి !

***

# 10. మరణంలో జీవించు

నేను ఆకాశం  నీవు భూమి
నేను లేని నీవు అసంపూర్ణం
నాలో జ్వలిస్తున్న జ్వాలకు
వారసత్వంకోసం అన్వేషణ నాప్రేమ
ప్రేమించడం ప్రేమించబడడం మిథ్య
అన్ని అనుబంధాలు అబద్ధాలు, అవి అవసరాలు
నన్ను ప్రేమించడమనేది
నాలోని శోకాలను రమించడం
నాలోకాలలో భ్రమించడం
నా మూలాలలో జీవించడం
నా సముద్రంలో స్రవించడం
నా ఆశయాలను ఆదరించడం
నా ఆనందాన్ని అనుభవించడం
నా ద్వేషాన్ని ద్వేషించడం
నా కలలను ఆవిష్కరించడం
నా కళలను పోషించడం
నా ప్రపంచాన్ని అలంకరించడం
నా ఆశలను సాక్షాత్కరించడం
కనురెప్పల మాటున కూడా కల్ల లేకుండా
పచ్చిగానైనా నిర్భయంగా స్వచ్ఛంగా జీవించడం
నా అశ్రువులలో అరక్షణమయినా ఆర్ద్రమవడం
ఆర్తిగా, ఆహ్లాదంగా, ఆహ్వానించడం
నాతో జీవితమే కాదు మరణంలో కూడ జీవించడం
ఇందులో ఏదీ సాధ్యం కానపుడు అంతా నటించడం
వీక్షిస్తున్నట్టు, కాంక్షిస్తున్నట్టు, ప్రేమిస్తున్నట్టు

క్రీడిస్తున్నట్టు, జీవిస్తున్నట్టు సాధ్యాసాధ్యమయిన
రజతాలు, పారిజాతాల ప్రస్తావన ఉండదు
పరామర్శలు, స్పర్శలు, సమర్ధనలు అన్నీ నటనలే
ఇంత వింత నాటకంలో
జీవించడానిక కారణం కోసం
నవ్వడానికి అవకాశం కోసం
ఆనందించడానికి అనువుకోసం
జీవితాన్ని నటిస్తూ జీవిస్తున్నట్టు నటిస్తూ
జీవనానికి కారణాన్ని నటిస్తూ
ఆనందాన్ని నటిస్తూ ఆక్రోశాన్ని నటిస్తూ
అశ్రుతను నటిస్తూ
మరణంలాంటి మరింత ప్రియమైనది
మరొకటి లేనట్టు నటించడం ,

***

## 11. వర్షసుందరి

వర్షసుందరి వయ్యారాలు పోతోంది
సంధ్యోషస్సులో తుషార సుందరి అందించే నిషాలా
నవ వధువు తటపటాయింపు నడకలా మొదలయింది వాన
ఆకాశం చెమ్మగిల్లినట్లు చిరు చినుకులు పలకరిస్తున్నాయి
మొక్కలు మోడుల్లా మాడుతున్న తరుణం
అమృతవర్షం కురిసింది ఆకాశం
వెతలతో పగుళ్ళు వారిన మాగాణి గుండెల రైతు
వానకు తడిచి ముద్దవుతున్నాడు
నాని సుద్దవుతున్నాడు
మైనంలా కరిగిన రేగడి అందరికీ అప్యాయంగా హత్తుకుంటుంది

కొత్తకోడలి అలకలా చిత్రంగా వుంది వాన
పాత వానే అయినా కొత్త చీరకట్టిన వర్షధార జిలుగులు
చినుకులతో కాంతి చింది వెలుగు తునకలు పంచింది
కోపిష్టి యిల్లాలి కొట్లాటలా ఉరిమింది ఆకాశం
అందంగా ఆనందిస్తున్న పూలకిరీటాల చెట్లు
పిడుగుపాటుకు ఉలిక్కిపడి పూరేకులు రాల్చాయి
చాదస్తపు యింటాయనలా ఆకాశం గొణుగుతోంది
ఉరిమే మేఘాల గర్జనల నేపథ్యంలో
దుమ్ముపట్టిన చెట్ల ఆకులను కడుగుతోంది వాన
ప్రియుని స్పర్శతో పులకించే ప్రేయసిలా
పరవశిస్తున్నాయి మొక్కలు
నీటిచుక్క కోసం ఎదురుచూసిన గుడిసెలకు
పెనువర్షం విషాదమే మిగిల్చింది
గుడిసెలు కూలిపోయాయి
ఆధారం జారిపోయింది
ఆకాశం రోధిస్తోంది వర్షపు ధారలతో

***

## 12. ఎమర్జెన్సీ

సమాంతర దారుల్లో
భిన్న ధృవాల సహచర్యం
జీవిత రైలు ప్రయాణం
నిరంతర సుదీర్ఘయానం
పలాయన బోగీలకు
అనివార్య సంఘటనలే ప్రయాణికులు
బొగ్గు యింజను మసి పూసి మారేడు కాయంటే
కరెంటు యింజనొచ్చి యిచ్చిన షాకులకు
గుండెల కండరాల రక్తం గడ్డ కడ్తుంది
నేను "మేము" గా మారి "మనం" కావాల్సింది
"నా" స్టేషనులో పాసెంజర్లు "మన" గా మసలక
మజిలీ రాకముందే "వారు" గా వేరైదిగిపోతే
కుటుంబ బోగికి సాధ్యం కాని సఖ్యత
సమాజ స్టేషన్‌లో ప్లాట్‌ఫాం ఖాళీలేక
ఎర్రజెండాలు స్వాగతిస్తుంటే
ఏ ఎజెండా లేని దళ ప్రభావమో
ప్రతి బోగిని పట్టి కుదిపేస్తుంటే
నల్లని కాయితం పై అక్షరం పొద్దు పొడవదు
యిది చీకటి ఖండం
దీపం తనను తానే వెలిగించుకుని
నిట్టూర్పులతో చలి కాచుకుని
ప్రాణపు వేడి పుట్టించుకొని
ఊపిరి నిలుపుకొని
గడ్డకట్టిన రక్తాన్ని కరిగించలేనపుడు
దాన్ని తొలగించడమే అత్యవసర శస్త్రచికిత్స

సుందరయ్య గ్రంథాలయం
90574
హైదరాబాద్ 500 044

❀❀❀

## 13. బంధాలకు వేలాడుతున్న శవాలు

వేర్ల విధుల గురించి పూలు పొరాలు చెప్తున్నాయి
స్వార్థ కాండపు ఔదార్యం సార్థకతను చాటుతున్నాయి
కన్నందుకు ప్రతివాడు కన్నతల్లిని ప్రేమించక్కర్లేదట
కని పెంచటము సర్వం సమకూర్చటము నేరమట
అప్పుడప్పుడు బాధ్యతట

జన్మనిచ్చిన పాపానికి శరీరాన్నీ, ధనాన్నీ
పంచుకునే హక్కు రాజ్యాంగమిచ్చిందట
బాట చూపటానికి దీపం వెలిగించినట్లే
కొవ్వొత్తిలా కరగడం నీ కర్తవ్యం అంటున్నారు
కుమ్మరి పురుగులా నిన్ను నీవు తొలుచుకొని
ఆశల దీపాల కాంతుల అవసరాలను
ప్రపంచరంగుల ప్రభంజనాలను చూపమంటున్నారు
కర్తవ్యపు భ్రాంతికి నీవు బలిపశువట
బంధాల కాంతి చుట్టూ తిరిగే వెర్రిశలబానివట
చెయ్యగలవు కాబట్టి చేశావు
అప్పులైనా, ఒప్పులైనా, గొప్పలైనా
చెయ్యగలం కాబట్టి మేంచేస్తాం
స్వార్థపు సమర్థనలయినా, కుత్సితపు విమర్శలయినా

యిది కుటుంబం యిక్కడ సర్వసాధారణం స్త్రీని దోచుకోవటం
రాదన్నవాడు రాజయ్యాడు
నేర్చుకొని పనిచేసిన వారు బానిసలయ్యారు
కన్నపేగు, కట్టుకున్న బంధమని ఉపేక్షిస్తే
రెల్లు పూల రేగు ముళ్ళగాయాలు
మాటాల తూటాలు కంటికి కనిపించని ఉరులు
సద్దాం ఉరిని వ్యతిరేకించిన ప్రపంచానికి
కనిపించని బంధాలకు వ్రేలాడిన శవాలు స్త్రీలు

***

## 14. మౌనం

మౌనం కూడా ఒక మహాకావ్యమే చదివితే
మౌనం ఒక మౌఢ్యం, అది పలాయనం
మౌనం కూడా జాడ్యం  అది స్వార్థం
మాట్లాడలేని మౌనం అహంకారం
మాట్లాడరాని మౌనం అజ్ఞానం
మాట్లాడనివ్వని కూడన మౌనం అణచివేత
తల్లితో మాటాడలేని మౌనం అలుక
చెల్లితో మాటాడలేని మౌనం కినుక
చెలితో చెప్పలేని మౌనం కోరిక
మనిషికి మాత్రమ్తే సాధ్యమయిన మాట
అవసరమయిన చోట మాట్లాడడానికి ఏంటట
మాటల్లో ఎన్నో సాధ్యమయినపుడు
మాటల్లో ఎందుకు పొదుపు
మాటలో ఊరట వుండగ
మాటతో మరులు పుట్టగ
మాటతో శాంతి విరియగా
మాటతో సిరులు కురియగా
మాటలు మాటలు కట్టి కోటలు కడతారు
హాయిగా మనసు తెరిచి మదిపొరల్లో
స్మృతుల్లో శాశ్వతంగా మాటలా నిలవచ్చుదా
తలచి తలచి మురవడానికి
తరచి తరచి తలపోయడానికి
మంత్రంలా  యంత్రంలా
సంజీవినిలా    సహజీవనిలా

సహచరిలా శాసనంలా
మహాప్రవాహంలా మాట్లాడాలి కదా
ఏ ఆట రాకపోయినా ఫరవాలేదు
మాటాడ్డం రావాలి
నేర్చుకోనయినా మాట్లాడాలి
మలయమారుతంలా, పరమ ఔషధంలా
ప్రణవంలా, ప్రళయంలా మాట్లాడు
మౌనాన్ని ఛేదిస్తూ మాట్లాడు
తరువాత మట్లాడాలనుకున్నా
అపుడు దాని అవసరముండదేమో

***

## 15. ఆమె ఆకాశం

ఆకాశానిదీ ఆడమనసే ఎంతో విశాలం
రోజూ నిష్క్రమించే సూర్యునికి
పడమటన టమాటా రంగుతో టాటా చెపుతుంది
ఎంతో ఉదారంగా రాత్రికిరాని భానునికై నక్షత్రాల నగలతో నిరీక్షిస్తూ
మేఘాల మేనాలను సిద్ధం చెయ్యమంటుంది
తూరుపు దిక్కున వెలుగురేఖై
ఎదురుచూపును మేలి ముసుగుగా కప్పుకుంటుంది
ఉషోదయానికి ఎర్రతివాచీ పరిచి స్వాగతిస్తుంది
చలి రాత్రిళ్ళు వణికిస్తుంటే
ఊహల వెచ్చదనంతో మురిసిపోతుంది
వెన్నెల వేళలో చంద్రుడు తోడొస్తానంటే
అర్కుని ప్రతిబింబపు వెలుగుకు ఉనికే లేదని
వెన్నెల జలకాలాడుతుంది
మంచుకురిసే రాత్రి, వర్షం తడిపే రాత్రి
ఉక్కగుక్కపట్టేరాత్రి ఎన్నో వెళ్ళపోస్తుంది?
పగటి వేళ వెచ్చదనంలో విరహవేదన మరిచి పరవశిస్తుంది
భానుని కాంతిలో భాసిస్తూ రాత్రిని మరిచి
అస్తమయంలో ఆగమని అర్థిస్తుంది సూర్యుణ్ణి
మళ్ళీ వస్తానని మభ్య పెట్టే భాస్కరుడు
అమాయకంగా ఆశగా ఆకాశం ఆడమనసుతో
తామర తరుణులు తోడంటూ ఉంటూ
జాజిపందిరి శయ్యాలంకారమంటూ
మాలతీలతల సుగంధాలు అతని రాకకు సాక్ష్యమంటుంది
దిక్కులు పిక్కటిల్లేలా చెప్తుంటాయి
రాత్రికి రవి రాడు రాడంటూ
అయినా వెర్రి ఆకాశం నమ్మదు ఆడమనసు కదా !
నమ్మడం తన బలహీనత, బలం కూడా !

***

## 16. ఉలిక్కిపడ్డ ఉరి

కుట్ర ఏరూపంలో వున్నా కుళ్లు కంపే
సామ్రాజ్యవాదం తెల్ల తోడేళ్ళరూపంలో
అమాయకపు, నిజాయితీ, బడుగు గొఱ్ఱెపిల్లల
వేటలో మునిగి చానాళ్ళయ్యింది
లొంగిపోయిన వాడికి ఉరిత్రాడు
మరణ ప్రతీకేకదా !
ఉరి ప్రకటించినపుడు మౌనగీతిపాడి
తాడు లాగబడ్డ తర్వాత ఉలికిపాటేమిటి
మనిషికి కావలసిన కనీస స్పందన మాసికంరోజు ఎందుకు
జాతికోసం పోరి ఉరికెక్కిన పులి మచ్చలను
తెల్ల తోలుకు అతికించుకొనే భీరుత్వం
ప్రపంచమంతా వ్యాపించిన 'గో పి " తత్వం
అనుకోకుండా జరిగిన ప్రమాదం కాదు యిది
డెడ్‌లైన్ చూపినా కళ్ళు మూసుకున్న గాంధారతనం
వెన్నుపోటు కూడా ఒక రకం వేటేకదా,
పాశవికతకు పర్యాయంకదా
సద్దాం ఉరి మనకళ్ళు తెరిపిస్తే
దేశభక్తి వుగ్రవాదం కాదు
బడుగు దేశపు గడ్డి పోచలతో
తెల్ల తోడేళ్ళ వేట అసాధ్యంకాదు

## 17. కొత్తకాని మరణం

ఎన్నో మరణాలను దాటుకు వచ్చిననాకు
ఇది ఎన్నో మనరణమో తెలియదు
మరణం నాకు కొత్త కాదు
కాని ఇది మాత్రం మరో కొత్త మరణం

కొంచెం కొంచెం బండబారిన తరుణం
సున్నితత్వం పారిపోతున్న తరుణం
మంచువెన్నెల నవ్వులతో మందుపూసి
దూదితత్వాన్ని మనసులో పాదుకొలిపి
వసంతం పూయించి మళ్ళీ బ్రతికించి...

మరణంలోకి నెట్టటం నీకు ఆటేమో
ఇది నాకు పురాతన మనశ్శాస్త్రం
మొగ్గ మనసులో కోరిక పండుబారిన తీరు
మంత్రజలంతో శపించబడ్డట్టు
మొదటికి వచ్చి ఆగింది శవజాగారం

తరతరాల ఘనీభవించిన పురషాధ్యిక్యాన్ని నమ్మి
మనసుకు డొల్లతనాన్ని ఆపాదించుకున్నా
నేను నవ్వుతున్నాను. మనసు రోధిస్తుంది
నేను నవ్విన కొద్దీ కళ్ళుపాడిభారుతున్నాయి
మరణం నాకు కొత్త కాదు...

వసంతం పూయించిన వంతెన
కూలిపోయింది పేకమేడలా

ఎదురుగానే ఉంటున్నా ఎడారి దూరం పెరిగింది
నువ్వు నవ్వుతూనే ఉన్నావు ఎప్పటిలాగే
తిరస్కృతితో మౌనంగా దహిస్తున్నావు

నువ్వు నన్ను కూడా తీసుకోలేవు అన్నమాట
వజ్రాయుధపు వేటయింది
కీర్తి కండూతిలో నాకెందుకీ దహనం
అందాల అబద్ధాలు, ఆ నవ్వులు అసత్యాలు
మరణం నాకు కొత్తకాదు

నీద్వారానే మరణిస్తున్నా కొత్తమరణం నాకిది
చితిలో బూడిదలు విభూతులవుతున్నాయి
నీ నవ్వుల మల్లెలు మంటలౌతున్నాయి
ప్రతిసారి నేనే కాలుతున్నాను స్వయంకృతం
పెనం నుండి పొయ్యిలో పడ్డ కాలుతున్న రాత్రి స్వగతం

అయినా ఆశ రెపరెపలాడె మనసు నాది
చకోరమో చక్రవాకమో ఏదో ఒకటి
గుండెల్ని చిట్లించి మెదడును ద్రవీకరించే
గారడివాడి చేతిలో కోతినయ్యాను
పైకి గెంతు, కిందికి గెంతు, గడెక్కు, సైకిలుతొక్కు
నీ నవ్వు కారుచీకటి కాటుకల అందం కన్నెపిల్లల కౌగిలిచందం
నాకు మరణం కొత్తకాదు
కాని ఈ మరణం నాకు ఇప్పుడు మళ్ళీ కొత్త

***

## 18. ఉత్తమ ప్రేక్షకులం

ఏ సంఘటన చూసినా ఏమున్నది గర్వకారణం
నరజాతి సమస్తం స్వపీడిత పారాయణం
బోధకులు బాధకులుగా మారి పాఠశాల గదుల్లో
అర్ధరాత్రులో పసిమొగ్గల జీవితాలను మసి చేస్తే
నైతిక విలువలు ఎండిన చెట్లకు, స్వయంగా ఉరి వేసుకుంటాయి
జన్మనిచ్చిన వారు వృద్ధాప్యంలో భారంగా తోచినపుడు
మానవతా విలువలు నిస్సహాయ సముద్రాల్లో మునుగుతాయి
విద్యనభ్యసించాల్సిన భవిత రక్తాన్ని పెట్టుబడి పెడ్తున్నపుడు
చదువుకోసం రక్తపు సాంపిళ్ళుగా మారుతున్న యుదతనుచూసి
ప్రభుత్వ అసమర్ధత
అధికారుల అవినీతిలో కలిసి వికటాట్టహాసం చేస్తుంది
మనిషి సాధించిన సాంకేతిక ప్రకృతి సైబర్ అశ్లీలంలా
పసిమనుసులను కలుషితం చేస్తున్నపుడు
బాధ్యులెవరన్నది వంద మిలియన్ డాలర్ల ప్రశ్న
వయసుతో ప్రమేయం లేకుండా
రెచ్చగొట్టే టి వి ప్రసారాలు
సగటు మనిషికి అగ్నిపరీక్షలయి
సవాళ్ళు విసురుతాయి
ఋణాల తోరణాలతో రణాల సలుపులు
బ్రతకడానికి పోరాటం కాకుండా
బ్రతికున్నందుకు పోరాడాలి

మనది కాని సమస్యలతో
మన ప్రేమయంలేని ప్రమాదాలతో
మనిషయిన వాడెవడయినా, మనసున్నందుకు
ఆలోచనలకు ముసుగులు వేసి
అంతా బాగుందని చేసుకుని
అంతా మనమంచికే అని పెంచుకొని
నష్టపడటానికి, దోచబడటానికి సిద్ధపడాలి
బలం వున్నవాడిది రాజ్యమయి
ఆటవిక న్యాయం ఏలుతున్నపుడు
మనసు చంపుకుని బ్రతుకుతున్నపుడు
మనమంతా ఉత్తప్రేక్షకులం

***

'తెలుగుపీపుల్ కామ్'
తేది 16 06 2007

## 19. గాంధీగారి కోతులు

కంచె చేను మేయడంలేదా
కనురెప్ప కాటెయ్యటంలేదా
ఆడది బూడిద కావడంలేదా
పసితనం వసివాడటంలేదా
కన్న కూతుళ్ళపై అత్యాచారాలు
కన్న తండ్రే కీచకుడయితే
అక్రమ విక్రమార్కుల రాజ్యం
కామాంధుల కాలం
ప్రశ్నిస్తే భార్య అయినా, చెల్లె అయినా, బిడ్డయినా
చివరికి కన్న తల్లయినా
దాష్టీకానికి బలి కావాల్సిందే
ఆకాశంలో సగం సాధన, కొంత కల్పన
కొంత విజ్ఞానరంగంలో, విపణి వీధుల విజయంలో
ఉన్నత విద్యల్లో స్త్రీ ఏమిటి?
ఆడది ఆడదే – మరో ఆడదాన్ని అంగడి బొమ్మను చేస్తూంటే
మదాంధులకు సహకరిస్తుంటే
అమాయకపు పల్లె పడుచులు పడుపు వృత్తుల్లోకి
చేతులు మారుతున్న కారెన్సీ పెద్దవారి ఖజానాకు
ప్రభుత్వం, న్యాయవ్యవస్థ, చట్టాలు యివే
గాంధీగారి మూడు కోతులకు ప్రతీకలు –

***

## 20. అక్షరంలానే జీవిస్తా

నేను బ్రతుకుతున్నాను   జీవించాలన్నది నా కోరిక
బ్రతకడంకోసం పోరాడుతూ   ఓడుతూ   గెలుస్తూ
జీవించాలనే కోరిక నా బాల్యానిదే అయినా నే బ్రతుకుతున్నా
జీవితంలో కొంతయినా జీవించాలనే ఆశను బ్రతికిస్తూ
జీవించడానికి కారణాలను అన్వేషిస్తూ దశాబ్దాలు బ్రతికా
నింగిలా   నేలలా   నీడలా   నీటిలా   బాధ సామాన్యమై
స్వీకారం, తిరస్కారంతో పనిలేకుండా బాధతో నేను తాదాత్మ్యమై
బాధ నాకు భరింపరాని దయినపుడు అక్షరం నన్ను ఊరడించింది
నాపైనే నా కోపం   నా అసమర్థతపైనే నా కోపం
ఆసరా అయిన అక్షరంపై కోంపగా మారి అక్షరం స్తబ్దించింది
ఊహల ఊపిరిపోయి   యంత్రిస్తున్నా   నిర్జీవంగా
కలం ఆగిపోయి, అక్షరం మరిచిపోయి
జీవితం మొఖంమొత్తి, ముఖం చాటేసే సమయం
అడవి అంటుకుపోతున్న అనల గాథత మనసునావహించి
అవని భారమై   జలధి గాఢమై   మనసు మూగదయినతరుణం
నెలవంకల చిరునవ్వులతో   ఆహ్లాదంగా
నా ఊహలను ప్రేరేపించిన భావన పరిచయం
ఉభయ సంధ్యల ఉద్విగ్నత నాలో అంకురించింది
నా అక్షరాన్ని కుదిపి, లేపి కలంతో పలవరించింది నాహృదయం
నన్నుద్ధరించడానికే ప్రత్యక్షమయిన నా ఊహ
కంటిముందు సజీవంగా సాక్షాత్కారించింది

నే శిశువునై జీవించాలనే నా కోరిక పులకరించింది
ఊహలలో కూడా జీవించవచ్చు అనే కొత్త పదం స్ఫురించింది
క్షరం లేని అక్షరం మధ్య మధ్య అదృశ్యమవుతుంది
మృగతృష్ణలా నన్ను తన వెంట పరుగెత్తిస్తుంది
అతిదగ్గరగా వుంటూ ఎడారి నిడివి దూరం పెరిగింది
అక్షరం ఆగిపోతుందనే భయం
ఊపిరి ఆగిపోతుందనే భయం
వెన్నెల శూన్యాన్ని వెలిగించినట్టు అక్షరంలానే జీవిస్తా
కేవలం అక్షరమై జీవిస్తా

❋❋❋

## 21. వనమూలికను

నేనో స్వేచ్ఛా విహంగాన్ని ఆనంద కెరటాన్ని
నేనో ఆహ్లాద వీచికను మృదుమధుర గీతికను
నేనో సుగంధ పరిమళాన్ని మానవతానుబంధాన్ని
నేనో ఉత్సాహోత్తు గాన్ని పవిత్ర ప్రవాహాన్ని
నవ్వు నా వ్యసనం
నా నవ్వును చూసి పరవశించే వారు కొందరు
పళ్ళు నూరే వారెందరో
నా గమనం అనివార్యం
గ్రామసింహాల నడుమ గజగమనంనాది
నన్ను చూచి గొళ్ళెం కొందరు పెడితే
తాళం కొందరు వేస్తారు
స్నేహ పరిష్వంగం నా ఆశ
అంగాంగ విచ్ఛేదం
వెక్కి వెక్కి ఏడుస్తుంది మనసు
ఎందుకే బంగారు అంతశోకం అంటుంది హృది
నటించలేకపోతున్నా నంటుంది మది
నటనెందుకు జీవించక ప్రశ్న మేధది
కేవలం బతకడం కాదు జీవించటం నా ఆశ
ఇప్పుడు బ్రతుకీడుస్తున్న నేనో ప్రహేళికను
పెదవి రంగులతో, ముఖాన నవ్వులతో
నేనో అందమైన చిత్రం
ఐతే అద్దంలో ప్రతిబింబం మాత్రం ఛిద్రం
కావలసింది కనిపించదక్కడ
నేనో శాంతిపావురం
నాలో శ్వేతవర్ణం స్వేదమై కరిగింది
నేనో హరితవనం హర్షాతిశయంకై పలవరింపు

అక్కడంతా అనావృష్టి
నేను పసిమి వెన్నెల వెలుగు
కరిగిపోతున్నా కర్పూరంలా
నే మిగిలిపోతున్నా రుధిర వర్షంలా
కేవలం రౌద్రంలా
నేనో స్వేచ్ఛావిహంగం, నారెక్కలకు కత్తిరింపులు
నేనో అహ్లాద వీచికను, విషాదం నాఛాయ
నేనో సుగంధ పరిమళం    కలుషితమవుతున్న ప్రతిచోట
నేను నేటి మహిళను మీ అందరికీ ప్రతీకను
మీ పెదవుల చివర చిరునవ్వై మొలవాలి
మీ కన్నులలో ఆనంద భాష్పమై నిలవాలి
మీ వాకిట ముగ్గును, మీ తోటలో పసిమొగ్గను
మీ మదిలో జ్వలిత జ్ఞాపికను
నేను కాను మాంసపు ముద్దను
అస్వస్థ సమాజానికి వనమూలికను
నేనో విజ్ఞాన దీపికను    జ్ఞానకాంతులు నా నైజం
పూచే పూవులు, వీచేగాలులు, కూసే కోయిల
పిలిచే తుమ్మెద అన్నీ నా కోసమే
నేనే ప్రకృతిని నాలోనే మీరంతా
మరి పూలు నలుపబడుతున్నాయి
తుమ్మెరలు ఆగిపోతున్నాయి
కంఠాలు మూగపోతున్నాయి
పిలుపులు నిలిచి పోతున్నాయి
అంతా స్తబ్దత    అంతా నిశ్శబ్దం
నే శబ్దిస్తా శక్తిలా    శబ్దపతులకు శాసిస్తా శార్వాణిలా
శ్లాఘిస్తా శారదలా    లాలిస్తా శరత్తులా
నేను నేటి మహిళను    మీ అందరికీ ప్రతీకను
అస్వస్థ సమాజానికి    వనమూలికను

❀❀❀

## 22. మృత్యునాదం

ఓ అదృశ్యరక్కసి తన యినుపగోళ్ళతో
కర్కశంగా రక్కుతుంటే
మెలిపడే పేగులు పెట్టే పొలికేక ఆకలి
ఓ కఠిన పాషాణం తన రంపపు పళ్ళతో
గొంతును కొరుకుతుంటే
తడారిన నాలుక పెట్టే చావుకేక దప్పిక
ఎండా వానా తోడుదొంగలై
వంతుల వారీగా పంతంతో హింసపెడ్తుంటే
ఈ దేహం చేసే మృత్యునాదం గూడు
సృష్టిలో ప్రతి పక్షికి గూడుంది
గూడు కట్టే చోటుంది, హక్కుంది
ఇనుపగజ్జెల తల్లి ముద్దు బిడ్డలు
పేదరికపు మురిపాల పట్టులు వారికి లేదు గూడు
ఓటుకోసం మీరు వేషమేసినపుడు
వరాల జల్లుల్లో మా అవసరాలు
తడిచి ముద్దయినపుడు
అరచేతి వైకుంఠంతో
మీ ఉదారత్వం అర్ధనగ్న నృత్యం చేసింది
రంగురంగుల జెండాలు ఊసరవెల్లుల్లా
ఒక 'జెండా' వెయ్యమని వెనక నిలిచింది
మరో 'జెండా' పీకమని లారీ దులిపింది
'ఈనాడు' ఇక్కడ మరునాడు అక్కడ
ఎక్కడెక్కడ వెయ్యడం, పీకడం, బాదడం
ప్రాణం నిలుపుకోడానికి పాడెకట్టడానికి ముందు

కావలసిన గూడు...
రంకు రాజకీయపురంగు
ముసలిపీనుగలకు పింఛను కావాలంటే
రేషనుకార్డు సాక్ష్యం..
రేషనుకార్డుకు కుటుంబ బంధం సాక్ష్యం
ఆ.. హంగులు కావాంటే
లంచమనే రక్తం పీల్చదానికి
ప్రాణాలతో పీక్కుతినే అవినీతి రాబందులు
నూరావులు కాదు.
నూటొక్క స్కాములు తిన్న రాబందులూ అన్నీ
ఒక్క సుడిగాలిదెబ్బ,
రాజకీయపు రంగు వెలిసే దెబ్బ
ఒక్కటే..?
గూడు లేక డొక్కలో తడి ఎండిన వాడి చేతిలో
వజ్రాయుధం ... ఓటు.

***

## 23. బతుకమ్మ   బతుకు

రంగుపూల సిల్కు పరికిణీ కట్టుకుని నే ఉరుకుతున్న
పొలంగట్లమ్మటి చెరువుకట్ట లెమ్మటి ఉరుకుతున్న
మామిడి తోటలెమ్మటి చింతతోపు లెమ్మటి ఉరుకుతున్న
పచ్చటి పొలాల అందాలు కమ్మటి గాలుల చల్లదనాలు
కోయిల పాటల గమ్మత్తుల మత్తులో మురుసుకుంట
నే ఉరుకుతున్నా
నా వెంట చింపిరి జుట్టులు, చినిగిన లాగులు ఉరుకుతన్నయ్
చెరువుల బాతులతో పోటీపడి ఈతగొడ్తున్న
మగ పోరగాళ్ళతో పందెమాడి చెట్లెక్కుతున్న
పపెంచంల అనందమంత నాదే అని మురుసుకుంట ఉరుకుతున్న
నే ఉరుకుతుంటే మా అమ్మ కళ్ళలో గుబులు
అది చూసి నేను సంబరంతో ఉరుకుతున్న
నా ఉరుకులకు అడ్డంవచ్చిందో పురుగు
అది చూసి నే ఒక గడియ ఆగిన, అయినా ఉరుకుతున్నా
అమ్మ గుబులు పెరిగింది   నాకు గుది బండయ్యింది
నా ఉరుకులాగినయి   నా పలుకులాగినయి
ఐనా మల్లా ఉరుకుతున్న.
చెప్పులు చేతపట్టుకొని   కడుపు చేతపట్టుకొని
ఎంగిలి కప్పులు పట్టుకొని   మసి బొచ్చెలు పట్టుకొని
మైల బట్టమూటలెంబడి ఉరుకుతన్న
పిల్లల చేత పట్టుకుని   సద్దిమాటలు పట్టుకుని ఉరుకుతున్నా
చిట్టి చిట్టి రాతలెమ్మటి   బొక్కుల కాయితాలెమ్మటి ఉరికిన
ఇంకా ఉరుకుతునే ఉన్న.
ఉద్యోగం కోసం ఉరుకు, ఊరుకోసం ఉరుకు, ఊరటకోసం ఉరుకు
నేనొక్కదాన్నే ఉరుకుతులే నాలాంటోళ్ళను చానమందిని
చూసుకుంట ఉరుకుతున్న
కొంతమంది ఆశలెమ్మటి ఉరుకుతున్నరు   కాళ్ళు కిందానటం లేదు

కొందరు ఆశయాలెమ్మటి ఉరుకుతున్నరు – కంటికానడం లేదు
కొందరు ఏ చల్లని కడుపుపంటలో సుఖంగా ఉన్నరు బిడ్డలనుకున్న
అళ్ళు కూడ ఉరుకుతనే ఉన్నరు – కంటికగపడని కడగండ్లెంట
పానం చేతపట్టుకొని కొందరు – మానం చేత పట్టుకొని కొందరు
పరదాంలెనక సుఖంగ ఉన్నమంటనే – ఉరుకుతున్నరు కొందరు
బురఖాలెనకనించి ఉరుకుతున్నరు
కళ్ళు లేనోళ్ళు ఉరుకతున్నరు – కాళ్ళు లేనోళ్ళు ఉరుకతున్నరు
ఉరుకలేనోళ్ళను కూడ ఉరుకిత్తంది పపెంచకం
యాపారమంట.. యవ్వారమంట ఉరుకిత్తన్నరు
పసితనపు దుబాయ్ దేశాలకు ఉరికిత్తన్నరు
బలవంతపు పెళ్ళిళ్ళకు – పెళ్ళిపేరుతో చావులకు
ప్రేమ ప్రేమంటు ఉరికిత్తన్నరు – పెత్తనమని ఉరికిత్తన్నరు
ఏటికాడికి – కాటికాడికి – బలవంతంగా చదువులకు చావులకు
రేవులకు పడవులకు ఉరుకుతున్నరు
ఆడపొల్ల పుట్టిందని ఉరికత్తన్నరు
ప్రతికాడనే ఉరుకుతనే ఉన్న
పడుకుంట లేచుకుంట ఉరుకుతునే ఉన్న
ఏడ్చుకుంట మొత్తుకుంట ఉరుకుతున్న
ఉద్దెమాలెంట – ఉద్దోగాలెంట యిష్టం ఉన్నా లేకున్న
నే ఉరుకతన్ననా? నన్ను ఉరికిత్తన్నరా?
తెల్వకుంట ఉరుకుతున్నా
ఏడ్చేటోళ్ళను చూస్కుంటా
నవ్వేటోళ్ళను చూస్కుంట ఉరుకుతున్నా
ఏడ్వనీకి, నవ్వనీకి కుదర్తలేదు
కులమంట, మతమంట రిజర్వేషనంట ఉరుకుతున్న
బతుకుదమంటె కుదుర్తలేదు
పయిలం కొడకా ! నే ఉరుకుతున్నా
మీ బిడ్డల మాత్రం ఉరికిచ్చకుండ బతికిచ్చుండ్రి.

***

## 24. నేస్తమా

శిథిలమవుతున్న నా కలలను పొదవిపట్టుకుని
పదిల పరచిన నేస్తమా
నైరాశ్యంలోని నా ఊహలకు
ఉత్సాహపు ఊపిరులూదిన మిత్రమా
నాతో స్నేహం
అఖాతాల అంచున ప్రయాణమని తెలిసి
సాహసించిన సహవాసమా
సహ ఉదరిని కాకున్నా
సానుభూతితో సఖిలా సహకరించిన సఖ్యమా
యాంత్రిక ప్రపంచంలో మాంత్రికునిలా
నాకోసం సమయాన్ని మంత్రించిన స్నేహమంత్రమా
మైత్రివనంలో పుష్పమా
నీవందించే సుగంధం
నాచుట్టూ పరిమళిస్తూ
నాహృదయపు గాయాలకు
మలాము రాస్తూ ఔషధమవుతుంది
గతిస్తున్న కాలానికి ఒక గతిని నిర్దేస్తుంది
నాయాతన నరకమయినా నీ ఉనికి  నీ ఊహ
లక్ష్యంకోసం పాదాలు అరిగినా, నన్ను
మోకాళ్ళపై పరిగెట్టిస్తుంది

***

'ఉదయసాహితి' కరీంనగర్ వారి
'చెలిమి' కవితా సంపుటిలో ప్రచురణ

## 25. స్మృతి సంపద

నేను నిన్నటి గతాన్ని స్మృతి సంపద నాది
నీవు నాటి నిజానివి అనుభవాల అన్వేషణ నీది
ప్రతి నేడు రేపటికి గతమే అవుతుంది
స్మృతుల సమాహారంలో మన కలయిక తప్పనిది

నే చూస్తున్నా ఆనందంవైపు నా అనుభూతికై
నువ్వు దిక్కులు చూస్తున్నావు చుక్కల్ని వెదుకుతున్నావ్
అనుభూతులు నీకు సరిపోవు అనుభవం కావాలి
నేను నిన్నటి గతాన్ని స్మృతి సంపద గొప్పది నాకు

నేను నదిని, కదలి పోతుంటాను
నువు తీరానివి కదలలేని తనం నీది
స్పీడ్ బ్రేకర్ దగ్గర ఆగని నైజం నాది
నా దూకుడు చూసి నీకు భయం

పన్నీటి వంటి పొగడ్త స్ఫూర్తి నాకు
పొగడ్తల పన్నీటితో దాహం తీరదు నీకు
నా కోరిక మనసుకు దాహం
అహంకారపు మునుగు కప్పకు నీ మనసుకు

మరుపురాని బాధ కూడా మధురమే నాకు
స్మృతులు నాకు జీవనాధారాలు
హిమధూమం లానే కదిలిపోతుంటాను

చలి స్పర్శే నీకు మిగిలేది

మృత్యుకాంక్ష నా నిరీక్షణ
స్మృతి సంపద నాది  నిన్నటి గతాన్ని నేను
ఏవి నా నవ్వే పెదవులు   ఏది నాహృది మధురహాసం
నే నవ్వుతున్నాను   నా స్మృతులు కదులుతున్నాయి

***

'కవితా మాలిక   2006'

## 26. గాజుల హేళన

నేను పట్టిందల్లా బంగారం    శ్రీహరికి పట్టపురాణిని
నే ముట్టిందల్లా తళతళ మొలకల మెరుపు
అందంలో ఆనందమె నా పయనం
నా మనసొక నందనవనం
నేనో నూతన ఋతువును
వసంతమా పూనకు నాపై కినుక
మల్లెలనవ్వులు మొల్లల పరిమళాలు నాసొంతం
ఇంతులు    పూబంతులు    చేమంతులు
నేను కాను ఎవరికీ సామంతను
ఇసుమంత చింత రానీకండి
కాంతులు    హేమంతుల    జయంతులు
మీ కోసం కాదు నా అలంకారం  భ్రమపడకండి
నేనో అందమైన తెమ్మెరను
ఆనందమే నా జన్మహక్కు
ఎవరికెందుకు ద్వేషం
నేనో నల్లరాతి గనిని
మీ శర పరంపరలు నన్ను తాకవు
నా గాజుల గలగలపై హేళనెందుకు
ఈ నా ఆకృతికి అహంకారం అలంకారం
దురహంకారపు మంటలెందుకు మీకు
అభిమానం నా ధనం    చౌర్యం మీ తరంకాదు
నా దుఃఖం మీ విజయమనుకుంటే    పగటికలే మిగిలేది
నరకంలో కూడా స్వేచ్ఛను పొందగల ధీరత్వం నాది

***

## 27. చదవాలనివుంది

సైన్సును పెంచిన
మనిషి సెన్సు ఎన్నో పొరల్లో జారిపోయింది
నాది ఏకైక సందేహసమూహం
అద్దంలా ముక్కలయిన మనసును
అతుకుపెట్టే విద్య ఏది?
పగిలిన అద్దం అతుకులు తెలియకుండా
ఏ “డిజైన్” సృష్టించాలో వెతకడం ఎలా?
మనసు మీది మరకలకు
‘విమ్‌డ్రాప్’ ‘లైజోల్’ ఏదైనా పనిచేస్తుందా?
గుండెకైన గాయాలకు
కారణాల ప్లాస్టిక్ సర్జరీ తెలిసిందా?
నడతకు మచ్చ వెతకడం తేలిక
మనసుపై ఏర్పడ్డ మరకలు, మచ్చలు తుడిచే
లిక్విడ్ మార్కెట్‌లో వుందా
చర్మమృదుత్వాన్నీ కాంతినీ పెంచే
గల్లీకో అనూస్ వీధికో ఏంజిల్స్
మనసు మృదుత్వాన్ని పెంచే
అలొవేరా ఏ అడవిలో దొరుకుతుంది
ఏ సందులో ఆ మూలికను వెతకాలి
ఆ శాస్త్రం ఏ పేటలో? కరువెందుకు ఆ వేటలో?
మానవ సంబంధం విలువల అనుబంధం
ఏ వెబ్‌సైట్‌లో పెట్టారు
ఏ ఛానల్‌లో చూపుతారు
నాకు చూడాలని వుంది
ప్రపంచ పాఠశాలల్లో పాఠాలుగా పెట్టవలసిన
మానవత్వం, మనసు తత్వం
ఏ తరగతిలో చెప్తారు
ఏ విశ్వవిద్యాలయంలో మొదలెడ్తారు
నాకెవరైనా చెప్తారా చదవాలని వుంది

***

## 28. ఊహామృతం

కలలలోకంలో ఎక్కడో ఎప్పుడో ఎదురయిన ఒక ఊహ
కళ్ళ వాకిళ్ళలో కదలాడుతూ నిత్యం కలవరపెడ్తే
ఉందో లేదో తెలియని మనసు అవునో కాదోనని ఆశలు
కనురెప్పల చాటున కాసారాలుగా మారి ప్రసవవేదన పడ్తున్నాయి
కదులుతున్న ప్రవాహంలో కలువ పూలు సాధ్యం కాదు
కష్టాల కడగండ్లలో కలలు సాధ్యం కావు
మనసు పొరల్లో ఎక్కడో ఊహ ఊపిరి సలపనివ్వదు
అగాధాల అంచుల ప్రయాణంలో కూడా ఆ ఆలాపన
నాకు తెలియకుండానే తనకోసం కలవరిస్తున్నా
ఊహల పరిమళాలను అఘ్రాణిస్తున్నా
అసత్యమయిన తనతో భౌతికంగా సంగమిస్తున్నా
వెతలతో వ్యభిచరిస్తున్నా, కవితల్లో కాలుజారుతున్నా
భ్రమలతో రమిస్తున్నా, జ్వలిస్తున్నా నిత్యం మరణిస్తున్నా
మరుక్షణం ఊహలతో జీవిస్తున్నా
నులివెచ్చని చలిలో ఊహలకౌగిలిని అనుభవిస్తున్నా
మంచురాత్రుల్లో తనకోసం నేనొకి అభిసారికను
నదీతీరాల్లో నే తనకై సైకత వేదికను
పూలపుప్పొడుల సుగంధాల నా మనసుకు ఔషధాలు
ఊహలే నా పాలిటి అమృతం   అందుకే
మరణించిన ప్రతిసారీ నే మరుక్షణమే జీవిస్తున్నా.

***

## 29. ప్రశ్నల ప్రహసనం

ప్రశ్నలడిగి సమాధానం చెప్తే "కౌన్ బనేగా కరోడ్‌పతి"
లక్ష్మీకటాక్షం
అడిగిన ఊసులందిస్తే "నీ ఇల్లు బంగారం కాను"
కాసులవర్షం
పార్లమెంటులో ప్రశ్నలడిగినా లక్షల ఆదాయం
ప్రేమ ప్రశ్నకు సమాధానమివ్వని ప్రేయసి హతం
ప్రేమను తిరస్కరించి పోలీసులను ప్రశ్నించిన గంగాభవాని హత్య
ప్రశ్నకు ఎంత ప్రాధాన్యతో
ప్రశ్నకూడా ప్రేయసిలా ప్రియమయినది
ప్రళయంలా భయంకరమయినది
ప్రాణాలను బలితీసుకుంటుంది
ప్రశ్నలడగడానికి లక్షలడిగిన ప్రజాప్రతినిధుల
గుట్టు రట్టు చేసినందుకు
మీడియాకు శిక్షవేయాలనే ప్రశ్న

జీవితమే ఒక ప్రశ్న
స్త్రీలంతా ప్రేయసులే, వయసుతో ప్రమేయం లేకుండా
రెండేళ్ళ పసిమొగ్గపై అత్యాచారం
కన్నకూతురిపై తండ్రి అత్యాచారం
కాశ్మీర యువతిపై మిలిటెంట్ల అత్యాచారం
విద్యార్థిపై ఉపాధ్యాయుని అత్యాచారం
కోమాలో ఉన్న రోగిపై డాక్టర్ అత్యాచారం
స్త్రీ ఉనికిపై ప్రశ్నల అత్యాచారం
నైతిక విలువలే అనైతికమవుతున్న సంధికాలం

స్త్రీశక్తి చైతన్యమవ్వాల్సిన యుగపరిణామం
ఆకాశంలో సగమంటూ నిరూపించిన కల్పనా చావ్లా
అధికారంలో సాధికారత పొందిన కిరణ్‌బేడి
క్రీడలరంగంలో రికార్డయిన పి.టి. ఉష కాదు
శ్రీలక్ష్మి, గంగాభవానీ హత్యాకాండలే కాదు
అయోనిజ సీతలా కష్టాలనుభవిస్తున్న స్త్రీలంతా
మాంసాకృతులుగానే గుర్తించబడ్డన్ని రోజులు
స్త్రీ విలాసవస్తువుగాను...
బానిస రూపంగానూ
ఆర్థికార్జనకు యంత్రంగానూ
చూసినన్నాళ్లు - చట్టాల్లో సవరణ కానన్నాళ్ళు
అరాచకాలు పునరావృతమవుతాయి
దేశాన్ని తల్లిగా దేశభక్తి ప్రదర్శించినా
ఆదిశక్తిగా దేవతను చేసి పూజించినా
అంగడి బొమ్మను చేసిన దౌర్భాగ్యం
విజ్ఞులదీ, విద్యావంతులదీ, కవులదీ, కళాకారులదీ
తిలాపాపం తలాకొంచెం కాకమానదు కదా?

***

## 30. మనవంతు ఎంత

గురువు జాతిగౌరవాన్ని నిలిపే తరువు
జ్ఞానర్షుషములను పెంచె చెరువు
మానవతా విలువలకు మేరువు
చిరుతప్రాయపు వెలుతురులకు హేతువు
సునామిలా మారగల జ్ఞానస్రవంతి

విద్యా దానం చేసే గురువుచే గర్భదానం ఏమిటి
మైనారిటీ తీరని బాలికలు బాలింతలుగా మారడం ఏమిటి?
కవులం, పండితులం, మేధావులం మనం చేస్తున్న దేమిటి?
మనకు రావలసిన రాయితీల కోసమే మన స్పందనా?
జాతి నిర్మాతలమైన మనం జాతికి తలవంపులౌతున్నామా !
మహిళ వయసుతో ప్రేమయం లేకుండా
మాంసపుముద్దలా ఎందుకు కన్పిస్తుంది?

నైతిక విలువలకు లోపం
వ్యంగ్య వ్యాఖ్యానలకు ఆదేశం
అరాచక కార్యాలు నిత్యం
రాక్షస కృత్యాలు బహుళం
అవుతున్న ఈ తరుణంలో
మనలో విలక్షణ లక్షణాలు లక్ష్మణరేఖను దాటనీయక
మానవ సంబంధాల సేతువుకు
ఉడతలా ఒక రేణువు నందించవచ్చుగా
ప్రహ్లాదునిలా, పరశురామునిలా, ఏకలవ్యునిలా
పుత్రులుగా, శిష్యులుగా వుండి గురువులౌదామా
మనలోని ఉదాసీనతను త్యజించి
కర్తవ్యమును మేల్కొలుపుదామా
మనమెంతో పొందిన ఈ సమాజానికి
మనవంతు సాయం అందిద్దామా !

***

## 31. మనోరాగం

నీకోసం ఎదురుచూస్తున్నంతసేపు నీవు రావేమోనని బెంగ
నా ఎదురుగా ఉన్నంతసేపు వెళ్ళిపోతావని బాధ
వెళ్ళిన తరువాత మళ్ళీ ఎపుడొస్తావోనని దిగులు
నీవు అనుక్షణం నాముందే ఉంటున్నా చూడవు
నా స్వప్నలోకాలలో సహచరివి నువ్వే
ప్రియా నువ్వంటే నాకెందుకు యింత యిష్టం
వసంతకోకిలకు మావిచిగురుపై ఎందుకు మక్కువ
ఆషాఢమేఘాలపై అందాల నెమలికెందుకు కోరిక
ముత్తెపు చిప్పకెందుకు స్వాతి చినుకుకై నిరీక్షణ
సాగరతరంగాల కెందుకు వెన్నెలకై ఆరాటం
యిదేనేమో ప్రకృతి పరమరహస్యం
కిలకిల రావాల స్వాగతాలు నాకు ఆనందం
మౌనరాగాలాపనలు నీకు ఆనందం
శబ్దతరంగాల స్నానాల ఆరాటం నాది
మౌనముద్రల చిత్రాల నిర్వేదం నీది
నాలోని నీవు నానుండి విడిపోయి
నాముందు నిలిచి శ్వాసిస్తూ సంభాషిస్తూ
దిక్కరిస్తూ, తిరస్కరిస్తూ, నిందిస్తూ
నాకు దూరంగా పయనిస్తూ, నన్నే వీక్షిస్తూ
నేనిపుడు విరాగిని అయినా నీ స్మృతుల సరాగిని
నీ రాక కోసం బెంగ బాధ దిగులు ఇవేవీలేవు
నేనే నిర్వేదమయినపుడు నాలో వెదకడానికేమున్నది
నే నిస్సంగుడను సంగమాల ప్రతిపాదనేది
క్షణం క్షణం మరణిస్తున్న నాకు మరుభూమితో అనుబంధం
మరోసృష్టి కోసం భావాల ప్రస్థానం నాది

***

## 32. సంజీవినిని ఎవరు తేవాలి

రకరకాల పెట్టెలు మాట్లాడుతున్నాయి
మనుషులు మాట్లాడుకోవడం మానేసారు
యంత్రాల మంత్రాల డబ్బాలకు కళ్ళు అతుక్కుంటున్నాయి
తెల్లవారుఝాము పదకొండు గంటలకు సూర్యుడొస్తాడు
ప్రపంచం పరుగెడుతుంది నే వీక్షిస్తున్నా
ఒమేగా పుష్పవికాసం గురించి ప్రశ్నించే బిడ్డకు
సమాధానం చెప్పలేని తల్లి అజ్ఞానురాలు
'ఇంటర్నెట్' సాలెగూటిలో చిక్కిన ఈగలు మనుషులు
పక్షుల కిలకిలా రావాలు రింగ్‌టోన్‌లో మాత్రమే
చెట్లేలేని మానవ ఎడారిలో పక్షులెక్కడివి
ప్రేమించకపోయినా, పోషించలేకపోయినా
చంపడమనేది సమస్య పరిష్కారమయింది
కరెంటు తీగ తగిలిన కాకుల్లా రైతులు రాలుతున్నారు
ఆత్మహత్యలతో పనేంటి
ఋణానుబంధాలు తెలియట్లేదు
బ్యాంకు ఋణాలు తప్ప
పన్నెండేళ్ళ పసివాడికి కండోమ్ అవసరమయింది
ఎయిడ్స్ ప్రచారఫలితం మరి
అమ్మానాన్న అవసరం అవసరాలు తీర్చేవరకే
ఈమెయిల్ చాటింగ్‌లో వాళ్ళు శత్రువులు
స్వార్థం మాత్రమే కళ్ళుతెరిస్తే
ప్రతి విషయం మనకనవసరం
అసమర్థత ఈర్ష్య పడితే కాలకూటవిషం
అలసత్వపు సమ్మోహనాస్త్రంతో మూర్ఛిల్లుతున్న మనకు
సంజీవినిని తెచ్చేదెవరు?

***

## 33. నిఘా

కన్నులపై నిఘా    చూపులపై నిఘా
పెదవులపై నిఘా    నవ్వులపై నిఘా
చేతులపై నిఘా    చేతలపై నిఘా
కలలపై నిఘా    కవితలపై నిఘా
భావాలపై నిఘా    అనుభూతులపై నిఘా
నడకపై నిఘా    నీడలుపై నిఘా
బండిపై నిఘా    బండిమీటరుపై నిఘా
సెల్‌ఫోన్‌పై నిఘా    మెసేజ్‌లపై నిఘా
స్నేహంపై నిఘా    స్నేహితులపై నిఘా
మాటలపై నిఘా    మమతలపై నిఘా
మొత్తం మీద అన్నింటిపై నిఘాతో నిషేధం మొదలు
కుట్రలు, స్వేచ్ఛను హరించే కుట్రలు
భర్త అంటే భరించేవాడు, బాధ్యత వహించేవాడు కాక
భర్త పదం బాధించేదిగా మారినపుడు
భర్తే జీవితకాలపు సమస్య అయినపుడు
అవమానాలకు అనుమానాలకు అస్కారమయినపుడు
పనికట్టుకుని ప్రతిసారీ పదిమందిలో నావ్యక్తిత్వపు బట్టలూడదీస్తుంటే
రక్షించవల్సినవాడే భక్షకుడవుతుంటే
అమ్మ వద్దు, అక్కవద్దు, తమ్ముడువద్దు, బిడ్డవద్దు, కొడుకువద్దు
కోడలు వద్దు, అల్లుడు వద్దు, స్నేహితులు వద్దు, శిష్యులు వద్దు
ఎవరితో మాట్లాడవద్దు, ఎవరూ రావద్దు, ఎక్కడికీ పోవద్దు
నాకు అన్నీవద్దు అనేది తనకు ముద్దయినపుడు
నాకూ జీవితమే ఒక కర్ఫ్యూ అయినపుడు
నాకీ జీవితం వద్దు    ఈ నిషేధం వద్దు    ఈ బానిసత్వం వద్దు

సు...గ్రంథాలయ * 90574 హైదరాబాద్ 500 44

చస్తానని బెదిరింపులు   చంపుతానని వేధింపులు వద్దు
వద్దు అన్నచోటనే ఆగి వుంటే
చదువులు లేవు   ఉద్యోగం లేదు
ఆస్తిలేదు   చివరికి నేనే లేను
చావు చావు అంటూ మృత్యువు ఒడికి నెట్టినపుడు
ఎందుకు పనికిరావంటూ తన అసమర్థత నన్ను ప్రతీకను చేసినపుడు
తన స్వార్థానికి రంగులుపూసి   నాకు రంకులు అంటగట్టినపుడు
ప్రతిసారి గోడకు కొట్టిన బంతిలా పైకి లేచా
దర్పణంపై పడ్డ కాంతిలా వెలుగులు చిమ్మా
ఒక్క పుట్టుకకే ఇన్ని మరణాలయితే
ఎన్ని ఎన్ని మరణాలయినా భరిస్తూ మళ్ళీ మళ్ళీ పుడుతూ

***

'సాహితీ స్రవంతి' భద్రాచలం వారి
భార్య కవితా సంపటి   2007

# 34. మధురిమ

మసక వెన్నెల మనసును గిల్లుతుంది
మగతగా ఉన్న మనసును తట్టిలేపుతుంది
మావి చిగురు తిని మత్తిల్లిన కోకిలలా
గొంతెత్తి గోల చేస్తుంది వెన్నెల
మంచువెన్నెల మధురంగా ఉంది
ఎదను గిల్లి జోల పాడుతుంది
కొండ శిఖరాలను అలవోకగా
లోయల అంచులను అధికారంగా
సముద్రపు వంపులను వడుపుగా
నదీ తీరాలను నమ్రతగా
హిమధూమంలా   మలయసమీరంలా సృజించింది

అరె   ఈ వెన్నెలకు అలసటేలేదు
పచ్చని పైరును, పడుచుల పైటలను తడుముతుంది
పల్లెల పరువాలకు   పట్నపు అందాలను చుంబిస్తుంది
అరె  ఈ వెన్నెలకు సిగ్గులేదు   భయంలేదు
ప్రపంచమంతా తానే అయి విహరిస్తుంది
ప్రకృతి అంతా తానే అయి పరవశిస్తుంది
కాసేపు ప్రియునిలా రెచ్చగొడుతుంది
మరి కాసేపు ప్రేయసిలా సేదతీరుస్తుంది
సుమమనోహరం  సుధామధురం ఈ వెన్నెల
అలసిన మనసుకు బాసటనేనంటుంది
వ్యధాభరిత ఎదకు ఊరటనిస్తుంది

కన్నీటి కాసారాలను సైతం కనుమరుగుచేసి
ఊహల ఊయల డోలలూపి
స్వర్గపు అంచులు చూపిన వెన్నెల
అయ్యో ! ఇంతలో ఏమయ్యింది
చంద్రుడు నల్లబడ్డాడా ఈ చీకటి చితులేమిటి
కాటుక మేఘంలా అత్యాచారమా ఈ అంధకార సుడులెందుకు
అదేమికాదు తారతో సరాగాలకు
కాస్త చాటుకెళ్ళాడు చంద్రుడు
వెన్నెలలా ఈ చీకటి శాశ్వతం కాదు
కాలచక్ర భ్రమణం మాత్రమే

***

# 35. నాలో నేను

తరతరాల తమస్సులో
సంసార సాగరాన్ని ఏకాగ్రతతో ఈదుతున్నా
ఎదుటేదో అడ్డుతగిలింది ఏ రాయో అని ఆగి చూశా
నీ రూపు అస్పష్టంగా ఉంది
దశాబ్దాల నరకయాతనకు అంతరాయం కలిగితే
మరణమేమో అని కళ్ళు తెరిచా కాదు
నీ నవ్వు ఎంత మధురంగా ఉంది
గ్రీష్మఋతువు ఎండల్లో మరుగుతూ కరుగుతూ ఉన్నా
ఉన్నట్టుండి చల్లనిఛాయ
మేఘమేమో అని పైకి చూశా కాదు
నీ స్నేహం ఎంత హాయిగా ఉంది
వసంతమాసపు పూల వాసనలలో మత్తుగా నిద్రిస్తున్న
నా కన్నులపై మెత్తని స్పర్శ
ఏదో పువ్వని కళ్ళు తెరిచా కాదు
నీముద్దు ఎంత తియ్యగా వుంది
మధురూహలు లేక బరువుగా చల్లగాలికి వణుకుతున్నా
వెచ్చనిస్పర్శ దుప్పటేమోనని వెతికా కాదు
నీ కౌగిలి ఎంత సౌఖ్యంగా ఉంది
కష్టాల వర్షంలో తడిచి ముద్దవుతున్నా
ఉన్నట్టుండి జల్లు ఆగింది ఏ గొడుగని చూశా కాదు
నీ హృదయపు నీడ ఎంత మధురంగా వుంది
చల్లని వెన్నెలను కూడా అనుభవించలేక తపిస్తున్నా

ఛెవిపక్కన గుసగుసలు ఏ తుమ్మెదో అనకున్నా. కాదు
నీ వెచ్చని శ్వాసలు ఎంత బాగున్నాయో
ఊహల పల్లకీలో ఊరేగుతున్నా
అడ్డుగా నే వస్తానని ఒక సంశయం ఎవరని చూశా
నీ స్మృతి ఎంత అద్భుతంగా ఉంది
నీ మధురోహాలు, నీవెచ్చని శ్వాసలు, నీ ఆలింగనం, ఆ చుంబనం
ఆ స్పర్శలు, ఆ తపనలు, అల్లరి తలపులు
ఉక్కిరి బిక్కిరి చేసే స్మృతులు
మళ్ళీ నన్ను పసిపాపను కావాలనే కోర్కెను ఎగేస్తున్నాయి
నాలో వున్న నిన్ను గుర్తించలేని నేను
నిజంగా గాంధారినే

❀❀❀

## 36. తల్లి

కట్టెలమ్మి కొడుకును కలెక్టర్ను చేసిన తల్లి
పత్తిచేలో పత్తి ఏరుతూ పత్తికాయలా మారినతల్లి
కొడుకు కోసం దూదిపింజలా తన బతుకునిచ్చిన తల్లి
ముగ్గమ్మి బిడ్డల్ని చదివించిన తల్లి ముగ్గుబుట్టలామారింది

పంటచేలో నాటువేసి, కలుపు తీసి, కుప్పనూర్చి
బిడ్డల చదువుకోసం కుప్పకూలిన తల్లి
మగాడితో సమానంగా ఇటుక బట్టీలలో పనిచేసిన తల్లి
పిల్లలను చదివించిన తల్లి

తాగుబోతు తండ్రిని మరిపించి తల్లీతండ్రీ తానే అయి
డాక్టరు చదివించిన తల్లి
సమ్మెటపోటు వేసి కర్రను సాగదీసి
సంతానానికి జీవితమిచ్చిన తల్లి
ఏ పని దొరక్క ఒళ్ళమ్ముకొని పిల్లల తీర్చిదిద్దిన తల్లి

కలెక్టరు కొడుక్కి తల్లిబరువు
డాక్టరు బిడ్డకు తల్లి ఎరువు
యాక్టరయిన వాడికి తల్లి అరువు
మొత్తంమీద తల్లుల బతుకు అంధకారం

గత అనుభవాల పొరాలతో భవితకు దారిచూపిన తల్లి
దారీతెన్నూ లేక అలమటిస్తుంది
గుడిమెట్ల దగ్గర కాళీ బొచ్చెలా

దవాఖానాల వద్ద అనాధలా
నడుంవంగి పోయి కళ్ళు కానరాక
చావును ఆహ్వానిస్తూ రేపటి తరాన్ని ప్రశ్నిస్తూ
ప్రతి ఊరిలో కనిపించే అనాధవృద్ధులు
ఆకలితో అలమటిస్తూ
అనుబంధం కోసం పలవరిస్తూ
పేగుబంధం కోసం కన్నీరుకారుస్తూ
రోగాలతో రొష్టులతో నిస్సహాయంగా
తన కడుపు మాడ్చుకొని బిడ్డకు జీవితమిచ్చిన తల్లి
డాక్టర్లు, యాక్టర్లు, లాయర్లు, రాజకీయనాయకులు
ఎదిగి మూలాలను మరచిన సంతానాన్ని ప్రశ్నించలేక
అన్నమో రామచంద్రాయని యాచించలేక
మధ్యతరగతి సమాజపు పరువుకోసం
బిడ్డలకు అపఖ్యాతని అడుక్కోలేక
స్వతంత్రంగా చావలేక
దేశభవితను మౌనంగా ప్రశ్నిస్తూ

❀❀❀

'దళిత కవితా సంపుటి 2007'

## 37. నా పాలిట పరబ్రహ్మం

జన్మదాత తల్లే అయినా జీవిత ప్రదాత తండ్రి
ప్రకృతి ప్రసాదించిన శరీరానికి ఆత్మనిచ్చే అతిథి తండ్రి
తండ్రి బింబమయి సంతుని ప్రతిబింబించి
ఈ లోకానికి ఆకారంలో అలంకారాలద్దే కళాకారుడు
తల్లిచ్చిన చూపుకు వింతలోకాన్ని చూసే ధైర్యానికి అర్థం చెప్పిన పండితుడు

పసితనంలో అరచేతుల వెచ్చదనంలో పొదిగిన పక్షి
వేలుపట్టి నడిపించి నడక నేర్పిన శిక్షకుడు
పడినచోట లేచి నిలిచేందుకు వెన్నుతట్టిన మార్గదర్శకుడు
మంచి చెడుల వీక్షించే జ్ఞానచక్షువు నిచ్చే ఆది గురువు నాతండ్రి
బ్రతుకు దారికి తోవచూపే నా పడవకు చుక్కాని

అమ్మ పెట్టే చిరుతిండ్లకు వాము, వెల్లుల్లి, ఉప్పుగళ్ల కలిపి
బుక్కకు పోసి అజీర్తిని ఆమడదూరం తరిమిన వైద్యుడు
క్రొవ్వొత్తిలా కరిగి వెలుతురు పంచి ఆర్థిక సమస్యలు పచ్చిపుండ్లలా
సలుపుతున్నా అలుపూ సొలుపూ లేక సరస్వతీ భిక్ష పెట్టిన దయామయుడు

హిమాలయంలా తలెత్తుకునే ఆత్మస్థైర్యాన్ని   నదీ జలాల్లా తోసుకుపోయే ధైర్యాన్ని
ఆకాశంలా విశాలమైన ఆలోచనలను, అమృతంలా ప్రేమను పంచే తత్వాన్నిచ్చి
అనువుగాని చోట అణువులా ఒదిగిపొమ్మన్న యోగి నా తండ్రి
మౌనం కూడా మహాకావ్యమేనని మరో విప్లవానికి పిలుపేనన్న విప్లవకారుడు
సుఖదుఃఖాలు వెలుగు నీడలని జ్ఞానజ్యోతిని వెలిగించిన గానునూనె దీపం
ఓడినచోట గెలుపును వెతుక్కొమ్మన్న యోధుడు   గీతార్థ సారము వినుడీ

అన్న సాధువు
జ్ఞాపకాలను త్రవ్వి పోసుకున్న ప్రతిసారీ
చిరుమొలకలా తలపైకెత్తిన శిశువు మానాన్న
అన్నీ భగ్గుమని గుడిసెలను కాలుస్తుంటే
ప్రాణాలొడ్డి ప్రాణులను కాపాడిన సాహసవీరుడు
వరద ముంపులలో తనతో నలుగురిని ఒడ్డుకు చేర్చిన గజ ఈతగాడు
సృష్టి బ్రహ్మదైనా జన్మ అమ్మయిచ్చినా జన్మకర్త ఈ జీవితానికి కారణం నా తండ్రి
నరాలలో నా జీవితపునాణ్యతను నింపి
రక్తంతో నా బ్రతుకుతో రంగులు వంపి
అస్థికలు కండరాలలో నాకు ఆకారాన్నిచ్చి
అన్నింటినీ మించి ఆత్మనిచ్చిన
బ్రహ్మ నాతండ్రి రామబ్రహ్మం   నా పాలిటి పరబ్రహ్మం

❁❁❁

'సృజనలోకం' వరంగల్ వారి ప్రచురణ
'నాయిన కవితా సంపుటి   2006

## 38. ఉద్యమాల అవసరం

ప్రమదవనాల్లో ప్రమాదాల ప్రయాణం
సుందరనందన ఉద్యానవనాలలో ఉద్యమాల అవసరం
ఏ దేశమేగినా మనం చూడగల్గింది దేహసౌందర్యం
కండరాల సౌష్టము, చర్మ లాలిత్యమే అయితే
ఏ సందులోనో, ఏ గుడిసెలోనో ఏ అవసంరలోనో
ఏ ఆకలిలోనో, ఏ ఆకారంలోనైనా ఒకటే
కన్నె, ముదుసలి, బాలింత, వయసుతో పనిలేదు
వావివరసలు అవసరంలేదు  దేహం ముఖ్యం
దేహాల ఆకలి  అందాల నరబలి

ముఖానికి ముసుగు, ప్రవర్తనకు ముసుగు
నవ్వుకు మంటకు, నడకకు ముసుగేసి
మోడలయితే తొడుగు అవసరంలేదా?
అందమైన శరీరంలో అంకురించిన అగుపించని వైరస్
నిన్ను నమ్మిన నిన్ను మాత్రమే కమ్మిన భార్య
నీ రూపానికి, నీ వంశానికి, నీ జీవితానికి
సజీవసాక్షులు నీ వారసులకు నీవు పంచేది
మృత్యుభయంకరమైన నీ జాడ్యాల జాడలు

పదేళ్ళు దాటితే చేయలన్నా ఏం చేయగలం
ఈ జీవితం అశాశ్వతం  మన ఉనికి శాశ్వతం
టీనేజ్‌లో టీకా తాత్పర్యాలు
మానవాకృతుల్లో సుఖాలు కాదు జీవితం

ధర్మాన్వేషణ, సత్యాన్వేషణ, ఆత్మాన్వేషణ వదలి
దేహాన్వేషణే నీ ధ్యేయమయితే

నీచూపు, ఆలోచన, మాట, పని, సర్వం
శరీరాల అన్వేషణ
ఏ సంజీవినితో ప్రక్షాళన కానిది
దశాబ్దాలు, శతాబ్దాలుగా మారినా
ప్రపంచంలో మనం అగ్రగాములం కావటానికి
నీలాటి సంచార రోగాలయాలే కారణం

***

## 39. తిరోగమనం

ఇది ప్రపంచం ఎంత ప్రదర్శనశాల
మన తప్పులను విమర్శించినపుడు
తల్లి అయినా అత్యంత ఏహ్యపదార్థం
మన అజ్ఞాన వీక్షణలో ప్రపంచమంతా అజ్ఞానమే

మాటకారితనం నందిని పందిగ చూసే నైజం
స్వంతరక్తంలో పరాయితనం
శూన్య జనారణ్యాలు
మానవత్వపు విలువలు ఆవిరయ్యేతీరు
స్వార్థం కాస్మోటిక్ సర్జరీతో నిస్వార్థపు రూపు
మేకవన్నె పులులు గోముఖ వ్యాఘ్రాలు
ప్రేమ కూడ హింసరూపమెత్తినపుడు
అత్యాచారాలు హత్యాకాండలై
నిజాయితీని వ్యభిచారిగా చూపే ప్రయత్నం
ఉప్పుకప్పురాల తేడా తెలిసేందుకు
స్కానింగ్‌లు, పోస్ట్‌మార్టమ్‌లు అవసరం
కుటుంబ మూలాలు కదులుతున్నాయి
గుండె కవాటాలు మూతపడుతున్నాయి
ఎవరికి ఏమీ తెలియడం లేదు, అంగాంగం అదృశ్యం
యాంత్రిక ప్రపంచంలో యంత్రాలతో కాపురం
ప్రాణం ఆగిపోయినా శవాలు నడుస్తాయి
రాత్రుల్లో పని, పగటి నిద్ర కొందరికి శాపం
టీ వి లకు కళ్ళు అతికించి మెదళ్ళు మొద్దుబారి కొందరు
చేయటానికి పనులే ఉండవు జీవితమంతా టైమ్‌పాస్
దేనికీ దేనితో సంబంధం ఉండదు అలసత్వంలో
అవసరాలు తీర్చే "బికరాలు"న్నపుడు శ్రమించడం పిచ్చితనం
సీతాకోకచిలుక గొంగళిపురుగుగా మారే తిరోగమనం

***

## 40. కాలాన్ని జయిస్తూ నేను

కాలాన్ని జయిస్తూ నేను
ఒక ఉనికిలా విస్తరించాల్సిన నేను
నేను లేనితనం శూన్యమయిన నేను
ఒక సామాజిక సజీవ సమాధిని
నాచుట్టూ నా వాళ్ళు నా మనుషులు నాకుగోడలు
ఖాళీగ్లాసులా, ఖాళీ కుర్చీలా నేను
ఒక్కొక్క చినుకు ఒక్కొక్క సెకను
నాలో నేను తడిచి నన్ను నేను తడుముకోవాలి
గడిచిన కొన్ని దినాలు, నెలలు, సంవత్సరాలు, దశాబ్దాలు
దీర్ఘశూన్యమయిన నేను నన్ను నేను పూరించుకోవాలి
పెనంపై పేలిన పేలపుగింజనై, ఎగదన్నుకు వచ్చే భూగర్భజలమై
గుండెగోడల ఊటతో జీవిస్తున్న గుర్తు
మరణించకుండుటే జీవిస్తున్నట్టు ఋజువై
ఒక విత్తనమై అంకురించి, ఒక కొమ్మై చిగురించి
ఎంతో ప్రళయించుకొని    నాలో నేను విస్ఫోటించి
అడుగు, నడక, జీవితం మధ్య సంబంధాన్ని కూర్చి
దారి, గమ్యం, లక్ష్యం, దూరం, వేగం, అవసరం రంగులద్ది
ఇప్పుడు సమయం నాకు వాహనం
కొన్ని దశాబ్దాల జీవితాన్ని ఒక్క దశాబ్దంలో జీవించాలి
ఫీల్‌గుడ్ అంతా బాగుందనే భ్రాంతిని
ఉప్పెనలా అత్యంత పుధృతవేగంతో విజృంభించాలి
గుండెలోయలో పుట్టిన కోరికల కొండనై ఎదగాలి
కొమ్మల్లో పక్షుల ఆకాశలో విహారమై

ఇప్పుడు దశాబ్దాలు నాముందు మరుగుజ్జులై
అతిదైనందిన జీవితంలోంచి బయటపడి
వార్ధక్యం సరిహద్దు చేరేలోపు
యుద్ధప్రాతిపదికన అత్యవసర యుద్ధాలు అనంతం
నా దగ్గర నాకోసం కన్నీళ్ళు యిగిరిపోయాయి
పిడికెడు గుండెలో అనంత సాగరాలు ఉప్పొంగుతున్నాయి
ద్వేషానికి మందు ప్రేమనై, దేహంతో దివ్యత్వానికై మంత్రమై
గుడ్డకాల్చి మీద వేసే లోకాన్ని కాల్చే అగ్నినై
కాలువ లాంటి నేను కాళికనై
బొన్సాయి మొక్కను చేయబడిన నేను
వటవృక్షంలా ఊడలతో శాఖలతో విజృంభించాలి
విశ్వంతో స్నేహించాలి   మరణంలో విస్తరించి
నేను నిజంగా నేనై జీవించాలి

***

'ఆంధ్రజ్యోతి' దినపత్రిక
తేది 01 08 2007

## 41. అందమైన అబద్ధం

భర్త అనే పదం బాధలకు పర్యాయపదమై
భరించడం అనేది మన జీవితమై
బాధలకు మూలాలను వెతికినపుడు
బంధమై, బాధ్యతయై నిలిచేది భార్య

ఆలిగా అలుసై అసమర్థతలను భరించేది
ఇల్లాలిగా ఇంటెడు చాకిరికి బానిసయి
భరింపరాని నేరమయిన వరకట్నానికి బలిపశువు
ఆపలేని మానసిక రుగ్మతకు నోవెడా అస్థిపంజరం

మరువలేని మనుస్మృతులకు మగువే మరుగు
మురుగుతున్న హెచ్ ఐ వి కి అధికారికమయిన అనువు
అణువణువున ఆత్మస్థైర్యం నిండిన
ప్రతిచోట పలుచబడేది భార్య

ప్రతివ్యక్తి వెనుక విజయమైన స్త్రీకి
తన అపజయానికి మాత్రం తానే కారణం
అవిటివాడి పెళ్ళాం అందరికి వదినే
అసమర్థుని పెళ్ళాం అవమానాల నెలవు

ఎన్నిమంటలనో మదిన దాచిన నవ్వు
ప్రతినిత్యం వాడిపోయే పువ్వు
మరో తరానికి మొలకలను రువ్వు

విద్య, ఉపాధి, ఔషధం ఒక పార్శ్యం
అర్థం, కామం, మోక్షం, మరో పార్శ్వం
తరతరాల అందుబాటు
తరగరాని పొందుబాటు
మల్లెల పానుపు
రేపటి మానవతకు మార్గం
నిన్నటి అణిచివేతకు సాక్ష్యం
నేటి తిరుగుబాటుకు బావుటా
పత్ని అన్నా అర్ధాంగి అన్నా
సహవాసి అన్నా, సహచరి అన్నా
ఏదయినా దోపిడికి, అణిచివేతకు
కొలమానం 'భార్య'

***

'సాహితి స్రవంతి' భద్రాచలం ప్రచురణ
'భార్య' కవితాసంపుటి

# 42. మృగం

ఏ జంతువుకు లేని సౌఖ్యం రెండుకాళ్ళ మృగానికి ఉంది
ఆడ జంతువు అనుమతి లేక అది సంభోగించదు
కాని మగవాడికి ఆ అనుమతి అవసరంలేదు
చూలుతో ఉన్న ఆడజంతువు వద్దకు సుఖం కోసం మగజంతువు చేరదు
మరో జంతువు కాని మనిషి అలా కాదు
పురిటినొప్పులు వచ్చేవరకు ఆడదానితో సుఖిస్తాడు
అవకాశం దొరికితే శవాన్ని కూడా వదలడు
కుక్కలకు చిత్తకార్తె ఉన్నట్టు ఒక్కొక్క జాతి జంతువు
కొన్ని ఋతువుల్లోనే శృంగారిస్తాయి కాని
మానవమృగం ఏ ఋతువులోనైనా
పగలు, రాత్రి తేడా లేకుండా సంభోగానికి తయారు
ఏ ప్రాణికి, జంతువులకు లేని హక్కు మానవత్వమున్న మనిషికి ఉంది
పెళ్ళామయితే చాలు ఎన్ని హింసలయినా పెట్టచ్చు ఏమైనా చేయవచ్చు
అర్థాకలితో మాడ్చవచ్చు, అనుమానంతో అవమానించవచ్చు
కత్తులు పెట్టి పొడవచ్చు నెత్తురు కళ్ళ చూడవచ్చు
అడిగేవాడుండడు ఎవరికైనా చెప్పినా వినేవాడుండదు
అణిగిమణిగి ఉండటం ఆడలక్షణం ఏ హింసనయిన భరించడం క్షమాగుణం
కన్నతల్లిదండ్రులు తమ కన్నపిల్లలే ఆమెకు సహకరించరు
చట్టాలు, శాసనాలు నేతి బీరకాయలో నెయ్యిలా న్యాయం చేస్తాయి
మూడు సింహాల క్రింది శాంతి భద్రతతో లేచిపోతుంది
గువ్వగూడును వదిలి ప్రాణం ఎగిరిపోతుంది
చచ్చిన తర్వాత కూడ కాకిలాగ పొడుస్తుందీ లోకం

❁❁❁

'దళిత కవితా సంపుటి 2006'

## 43. బాలల ఉత్సవం

నల్లబంగారునిధుల్లో ఉత్సవం బాలల బ్రహోత్సవం
మరచిపోతున్న సంస్కృతికి, మరణిస్తున్న సృజనకు అమృతోత్సవం
రామభద్రుని క్షేత్రానికి చేరువలో జరిపిన బాలల దినోత్సవం
స్మృతుల సుందర వనవిహారం ఎంత ఆహ్లాదం
భావ వీచికలతో అనుభూతుల దివిటీల ఊరేగింపులు
బాల్యపు సుఖాల సుగంధాలు శైశవ సాహసాల ఆశల పర్వతాల ఆరోహణలు
ఆలోచనా విహంగాల విహాయస వీక్షణాలు హరిణ బృందాల
ఆనందతాండవాలు
కళ్ళముందు కదలాడి కథలు అల్లాయి
మరోసారి నే గొల్లభామనయ్యాను
గోపికలా గోపాలునితో సరసమాడాను
గోంగూర నృత్యంలో కోదలినయ్యాను
బంజార నాట్యంలో గజ్జెలతో పాటు డప్పుగా మోగాను
అబ్బో ఎన్ని స్మృతులు, ఏవి ఏవని చెప్పగలను
అన్నీ బాల్యపు భావావేశాలను తట్టిలేపి
స్మృతులతో తడిపి ఊహలతో ఊయలలూగించాయి
ఎందరో బాలలు అందరి వదనాలలో ఆనందడోలలు
ప్రతి బాల ఆనందం నేనే అయిన అనుభూతి
నాకీ వరాన్నిచ్చిన సుందరమూర్తికి కవితాభివందనాలు
మధురస్మృతిగా అచేతనలో వివశనై
మరో ఉత్సవానికి రామేశుడి కార్యంలో ఉడుతనౌతా
శాస్త్రీయ నృత్య ఆహార్యంతో బాలలు రంగు రంగుల సీతాకోకచిలుకలు
జానపదులవలె విలక్షణ సుందర కుసుమాలు
ఇంద్రధనస్సును మించిన రంగు రంగుల చిరునవ్వుల దివ్వెలు
యిన్ని పూవులను ఒక చోట చేర్చిన వనమాలిదెంతటి గొప్ప అభిరుచి

యిది రాజసూయం, అశ్వమేధం కాకున్నా
రేపటి తరానికి పుత్రకామేష్టియాగం
పిల్లల రాజ్యానికి కళాత్మక పునాదులు ఎంత అద్భుతం
వేల జీవితం బాల్యస్మృతులు మిగిల్చిన ఘనత అమోఘం
భావి సమాజానికి చేసిన మానసిక శస్త్ర చికిత్స బూజును దులిపే మరమ్మత్తు
ఈ ఉత్సవంలో నేను ఒక ప్రేక్షకి నయినందుకు ఆనందం
ఇది నా జన్మకు బ్రహ్మానందం

***

'కొత్తగూడెం క్లబ్ నిర్వహించే
బాలోత్సవ్ 2005 కోసం'

## 44. ఏదైనా ఎవరైనా

నగ్నత్వమొక్కటే కారణం కాదు సిగ్గుపడటానికి
అవమానాలు అనుమానాలు ఏదైనా కావచ్చు
అత్యాచారమే చేయనక్కరలేదు మనిషి. సజీవ శవాన్ని చేయడానికి
మానసిక శారీరక హింస చాలు
పరులెవ్వరూ రానక్కరలేదు అత్యాచారాలు చేయడానికి
తండ్రి కావచ్చు, మామ కావచ్చు, అధ్యాపకులు కావచ్చు
హంతకులే రానక్కరలేదు ప్రాణం తీయడానికి
డాక్టరు కావచ్చు, డ్రైవరు కావచ్చు అజాగ్రత్త చాలు
హత్యలే చేయనక్కరలేదు ప్రాణిని అంతం చేయడానికి
డాక్టరు కావచ్చు, నర్సు కావచ్చు, నానమ్మ కావచ్చు ఆడపిండంకదా
దొంగలే కానక్కరలేదు దోపిడీ చేయడానికి
అధికారి కావచ్చు, అల్లుడు కావచ్చు అవినీతి చాలు
కారణము, దోషము ఏదీ అవసరం లేదు ద్వేషించడానికి
అసూయ ఒక్కటి చాలు నాశనం చేయడానికి
తీవ్రవాదే కానక్కరలేదు తిరగబడటానికి
పిల్లి చాలు పులిలా మారుతుంది సహనం చస్తే
ఆయుధాలు, అధికారాలు, అక్కరలేదు అన్యాయాన్ని ఎదిరించడానికి
ఆత్మవిశ్వాసం ఒక్కటి చాలు

***

# 45. సమీనాలా ఎందరో

పడమరన సూర్యుడు    చెరువులో ఈతగొడ్తున్నాడు
నాలాగే గతంలో మునిగిపోకుండా
గుర్తుకురాని నిన్నలా మిగిలిపోకుండా
నా బాల్యం నాముందే    నాకు తెలియకుండా మాయమైంది
గుల్లేరు దెబ్బతప్పించుకున్న కాకిలా    లేచిపోయింది
మిగిలిదంతా నెత్తుటివాసనే
స్మృతులను ఎన్ని రకాల సబ్బులతో స్నానమాడించినా
ముక్కుకు చేరక మనసుకు తెలిసిన పుండు వాసన

'యవ్వనం' వచ్చినట్టే తెలియకముందే దోచబడింది
కన్నుకు తెలియకుండా కలల ప్రవాహం జారినట్టు
చట్టం చేసినా ఆగని 'అవినీతిలా' 'మద్యపానంలా'
నా"దేహం" కూడా "విదేశీమారకద్రవ్యం" అయింది
మనిషి పశువుగా మారినట్టు
సాక్ష్యంగా మిగుల్తున్న నీచువాసన

వృద్ధాప్యం తరుముతుంది ఉగ్రవాదంలా
మనతోనే వుంటున్న మనవాళ్ళు
వున్నట్టుండి బాంబులా పేలిన పగవాళ్ళై
మనకు తెలియకుండానే మనలో భాగాలై
మనను విభాగిస్తున్న వాసన
చెమటకంపు, నెత్తుటికంపు, నీచు కంపుకలిసిన
దౌర్భాగ్యపు కంపు
ఆనాడు    ఈనాడు    ఏనాడూ
నేను ఆడదాన్నే    ఆడినదాన్నే

ఎదురాడిన దాన్నే
ఎదురాడిన ప్రతిసారి ఓడినదాన్నే
జల జల రాలిన అశ్రుధారలా
కణకణలాడిన శుక్రకణ సందోహంలా
భుగ భుగ పొంగిన రక్త ప్రవాహంలా
నే ఉద్యమిస్తున్నా
నా కన్ను నేనే పొడుచుకొని
ఆకంటి వెలుగుతో దీపం ముట్టిస్తున్నా
నేను "సమీనాను" 'సమజ్' కాలేదా?
నా నాన్నచే దోచబడినదానను
ఆడవాళ్ళకు సమస్యలేమిటి
"ఆడవాళ్ళే సమస్య" అనే 'నాసమజ్' గాళ్ళకు
సమాజంలో ప్రతిచోటా నేనే
తాబేలులా నీలో నీవే ముడుచుకోకు
తలెత్తు ఆకాశం నిండా అప్పుడు ప్రత్యక్షిస్తూ నేనే
సముద్రమంత సమస్యలతో
సూర్యుడిలా ఎదురీదుతున్నా
సూర్యుడు నేను సత్యం
నేను నా సమస్యలు నిత్యం
నా కనురెప్పలు కత్తులుగా ఒక నిర్విరామ యుద్ధం

***

(తేది 04 06 2007 రోజున TV 9 లో చూపిన 'సమీనా ఉదంతాన్ని' చూచినప్పటి స్పందన)

## 46. వంద/వంద ?

పసిమేకలను బందెలదొడ్లో వేసి
పెద్దపులుల కాపలా
తెల్లవారుజామున నాలుగుగంటలకే బ్రహ్మీముహూర్తం
మా బాల్యం చట్టుబండలు కావటానికో మంత్రం
గొర్రెల మందలో నేనో గొర్రెపిల్లను
నాకు "ర్యాంకు" ల తోక పెరగట్లేదు
నే చదివింది మెదడుకు చేరక
ముక్కున కరుచుకొని
ముచ్చటగా దులిపేయడమే
నా చర్మంపై మీరు మొలిపించగల్గిన 'బూరు'
గడియారంలో అంకెలతో మార్కుల జాబితాల పోటీ
వంద బై వంద (100/100) కోసం అమ్ముడుపోతున్న విలువలు
నేనో పసికూనను పసిడి కొండలతో కొనలేను సరస్వతిని
వీధిబడి చదువుల్లో నేర్చిన మానవత్వం
'కార్పోరేట్' చదువుల్లో మృగ్యమైతే
నాకు 'మీ' తో పోటీ సరిపోదు
వేలమందిలో వందమందికి మార్కులతో మేధనుకొలిచి
వస్తువులుగా బాల్యాన్ని గ్రేడింగ్ చేసి
కొంచం కొంచంగా మా సృజనను 'కండిషనింగ్' చేసి
ఓటమిని అంగీకరించలేని అవిటితనం మా కలవర్చి
సంవత్సరాంతాన మార్కులుగా మనుషుల మూల్యాంకన
ఏడాదంతా మీరు సిద్ధం చేసిన సుదీర్ఘ ఆత్మహత్యల రంగం

మా జీవితాల కొలబద్దల నిర్ణయం మీకెవరిచ్చారు?
మా ప్రాణాలు తోడే హక్కు మీకు ఎలావచ్చింది?
మా మెదళ్ళను కేవలం మాంసపుముద్దలు చేసి

మనసుల్లో ఏ స్థితికాని 'చంచలత్వం' పోసి
'టెక్నికల్'గా సాధించిన ప్రగతి ప్రయోగాలు మాకంటగడితే

నాకు నచ్చడం లేదు
నీ సోకు నాకు నప్పడం లేదు
మా అయ్యల డబ్బుల సంచులు మీకు కొమ్ములు మొలిపించి
మీ అహంకారం మా బతుకుల్ని కుళ్ళ పొడిస్తే
విద్యాబోధన పేరుతో మీ హింసను
ఆపే చట్టం మాకు తెలవదు
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆరు కోర్సులతో అరంగేట్రం
పేరేమో సుందరమ్మ అమ్మాయి వంటిట్లో పంధ్ల వాకిట్లో
'ఐఐటి' చదువుల్లో "బయోటెక్నాలజీ"ల్లో
మన దేశం, మన భాష, మనసు, మానవత్వం బోధన వద్దా?
పేరు గొప్ప, ఊరుదిబ్బ
చదువును కొలిచే మీటర్లు ర్యాంకులా?
సాధనకు మీటరు సంపదా?
ప్రగతికి కొలబద్ద విజయమేనా?
మరి ఆత్మస్థైర్యానికి అర్థం చెప్పేదెవరు?
ఓటమిలో నిలబడటం ఎవరు నేర్పాలి?
ఫలితాలొచ్చిన మరుక్షణం మీడియా, చిలుకపలుకులతో
ఊదరగొట్టి మా చెయ్యిని మా నెత్తిన్నే పెట్టే మాయాజాలం
బతికుంటే బలుసాకు తినొచ్చు
మీ ఖార్ఖానాల్లో మా బాల్యాన్ని బందీ చేయకండి
మా బతుకులు బుగ్గిపాలు చెయ్యకండి
అయ్యివార్లూ మా వాళ్ళకు
అరచేతిలో వైకుంఠం ఆశచూపడం ఆపండి
లేదంటే నల్లబల్లలు ఆయుధాలవుతాయి
కంప్యూటర్‌వైర్లు ఉరితాళ్ళవుతాయి
హత్య, ఆత్మహత్య ఏదయినా మారణహోమమేకదా!
మా ఋణానుబంధం మారణహోమమా!

***

## 47. ఒక ముఖం ఎన్నో ముసుగులు

ఒక్క ముఖానికి ఎన్ని ముసుగులో
ఒక్క మనిషి ఎన్ని ముఖాలు తొడుక్కుంటాడు
నటించలేని అవిటితనం కూడా ఆనందమే
భ్రాంతి ఎప్పుడూ సత్యాన్ని చెప్పదు
కల ఎప్పుడూ నిజాన్ని పలుకదు
అనుభవం చెప్పే పచ్చి నిజాలు
బాలింత శరీరపు సలుపులంత నిజం

ఆస్వాదించగలిగితే పిచ్చితనమంత సుఖం మరోటిలేదు
స్నేహం ఒక రకం పిచ్చి
ప్రేమ మరో రకం పిచ్చి
భ్రమల తెరలు గాలి తెమ్మెరలకు తొలగవు
కంటిని కరిగిస్తూ వచ్చిన అశ్రువై
సమాధిని పగలకొట్టుకొచ్చిన ఆత్మై
భూమిని చీల్చుకొనివచ్చిన అంకురమై
వాస్తవాలు పొద్దులా పొడుచుకు వస్తే బాధేమరి
చీకటిని తరిమే కాంతై
అపోహాలను ఛేదించుకు వచ్చే సత్యం వేదనే
స్నేహం రాజకీయమై ప్రేమ నాటకమై
జీవితచదరంగం తుమ్మ ముళ్ళ గళ్ళే
ప్రతిపావుకీ ప్రతి ప్రాణికీ ప్రతి ఘడియ గండమే
బలిపీఠం ఏదైనా పునారావృతమయ్యేది చరిత్ర పాఠాలే
ప్రతి మనిషి ఏదో ఒకచోట
కట్టుకొయ్యకు కట్టిన బలిపశువే
బంధాల సాలిగూటిలో ఈగే

మనిషి తనంతట తానే
తన ముసుగులను ఒక్కటొక్కటిగా చించుకుంటూ
ఒక ముఖంలో అనేక ముఖాలను ఐక్య చేసుకొని
ఒక్కొక్క ముఖం ఇటుకల్లా పేర్చి సిమెంటు తాపడం చేసినట్టు
ఒకే కట్టడంలా ఒక్క ముఖంతోనే మనిషి
ఏ ముసుగూలేని మనసుతో
తల్లిగర్భం నుండి వచ్చిన శిశువులా
తడితడిగా, ఆర్ద్రంగా
పచ్చి పచ్చిగా, స్వచ్ఛంగా
మెత్తమెత్తగా, ఆర్తిగా
దాహం మోహం లేని పాదరసపు మనసుతో ఉంటే ఎంత బాగుండు
మొగిలి పూరేకుల్లా అయినా
గరుగ్గా గీరుకునే సుఖం నాకొద్దు
సౌందర్య వంతమైన హింసనాకొద్దు
బాధించేప్రేమ వద్దు
భ్రమల మేఘాలు భళ్ళున తెరుచుకుని
వాస్తవం చెళ్ళున బహిర్గతం కావాలి
మనసు ఎడారులనుండి పెదవుల తీరాలకు ప్రవహించే
అద్భుత సంపద
అవమానాల అగ్నిలో కాలి
అనుమానాల సముద్రంలో తేలి
ముసుగులేని జీవితంలా
నేను మనిషిని   నాకు ఒకే ఒక్క ముఖం
ఒక్క నవ్వు చాలు

***

## 48. శూన్య పరిపూర్ణలోకాన...

అనుభూతులు నింపుకుందామని
నిన్ను ఆహ్వానిస్తాను
అపనమ్మకాలతో అభిషేకించి
వీడ్కోలు చెప్తావు
ఎవరినీ ఎవరూ ఏమీచేయలేని
శూన్య పరిపూర్ణ లోకాన నగ్న ఆకాశంలా నేను
రకరకాల అచ్ఛాదనల భూమివై
అనుమానపు నక్షత్రాలను నాపై వెదజల్లుతూ నీవు
నెలవంక నవ్వులతో నేనుంటే ఆనందిస్తున్నావే ఈర్ష్యాగ్నిలో జ్వలిస్తూ
నిన్ను నీవు భస్మిస్తూ నన్నూ భస్మీకరిస్తూ
పూర్ణానందం లోపం ఇద్దరిది
ఇదేది చూడలేనితనం నీ మనసుది
కొంచం స్వప్నం , కొంచం ఊహ అనంత దుఃఖసాగరం
ఆత్మలేని దేహంలా
ఆనందమే లేని జీవితమై
దీర్ఘశోకితనైతే నీకానందం
నా ఓటమి నీ గెలుపనే భ్రమానందం నీకు బ్రహ్మానందం
అదికూడా దక్కనివ్వని అష్టమైన శత్రువును
నీకే కాదు చాలామందికి నేనంతే
అర్థంకాక , అర్థంకానివ్వక ,
అర్తినై అనామికనై ఆశవాదినై అపరాధినై ఆరాధితనై
కనిపించక వినిపిస్తూ వినిపించక కనిపిస్తూ
అందరిలో జీవిస్తూ పక్కపక్కనే చరిస్తూ
రైలుపట్టాల్లా కలవకుండా, విడిపోకుండా
ఉండడం కాదు జీవితం
వేటాడి, వెంటాడి గమ్యం చేరడం లక్ష్యం

***

## 49. దేహాన్ని మనసుతో ధరించినపుడు

ఇక్కడ నేను అందమైన భావాల పొదరింట
సేదతీరాలనే ఊహాలోకాలలో

అక్కడ నీవు సుందర ఇంద్రభవనాల
స్వేచ్ఛాబంధాల బంధిఖానాలో

నేను పోరాడుతున్నా  కాలాన్ని జయించాలని
జీవితాన్ని నిర్మించాలని  దేహాన్ని మనసుతో ధరించాలని

నీవు పోరాడుతున్నావు  కాలాన్ని ఈదాలని
జీవితాన్ని గమించాలని  దేహాన్ని భ్రమించాలని
ఆనందమే నీ ఆరాటం  అనుభవశూన్య పోరాటం

నే వేటకు సిద్ధపడి  వస్తుసామాగ్రిని
విషయతాత్వికతను  అన్వేషిస్తున్నా
నీవూ వేట ప్రారంభించావు
జాలరుల సమూహం  నీకు పనిముట్లు
పరికరాలు నిన్ను రక్షిస్తున్నామంటూ
నీ స్వేచ్ఛను భక్షిస్తూ నిను సాధిస్తూ వేధిస్తూ

రంగుల లోకపు హంగుల్లో నీవు ఆధారితవు
సర్వశక్తులు సమకూర్చుకుంటూ
నేను ఆశ్రితను
జీవితమంతా చీకటిదీపం వెలిగించే ప్రయత్నం

స్త్రీ అంటే ఆడదికాదు అని చెప్పటానికి
ప్రేమతో చేత్తో నిమరబడుతున్న శరీరం
అస్థిపంజరమవుతుంది
జీవితం ఎలాగు శిధిలమయింది
ప్రేమానుభూతి శూన్యం
ప్రేమ కూడా బాధే  భయమే
స్వార్థం తొడుక్కున్నపుడు

జాలరులను చేపలు వేటాడుతున్నాయి
దేహం ఒక ఎర  స్నేహం ఒక ఎర
విద్య ఒక ఎర  నవ్వు ఒక ఎర
మాట ఒక ఎర

ఒకరినొకరు వేటాడుకుంటూ  కొత్తపోరు
పర్సుతో  బంధంతో  నానా కంగాళీతో
ఎరవేసే జాలరికి ఇప్పుడు చేపలు ఎరవేస్తున్నాయి
రతికార్యం తరువాత రససిద్ధిలాంటి
అనంత కార్యాలనంతరం లక్ష్యసిద్ధికోసం

❋❋❋

## 50. మృత్యుగుండం ముదిగొండ

పంపకానికి ఎసైన్డ్ భూములు
బడుగు జీవితాలు ఎస్సైన్‌మెంట్

ఇక్కడ విమానాలు టవర్స్‌ను విచ్ఛిన్నం చేయవు
నల్లని అశాంతుల బాంబులు పేలవు
దేశద్రోహం ఏమీ జరగలేదు
యుద్ధోన్మాదం అసలే లేదు
మతం మిన్నాగై పడగవిప్పలేదు
ఎన్‌కౌంటర్ జరగలేదు
కోవర్టులుగా గుర్తించలేదు

అయినా మృత్యువు క్రీనీడలా
పోలీసుగుండ్లై గుండెలో మారింది

నడుస్తున్న అగ్నిగుండం వంటి అర్భకుడు
అప్పటివరకు కంటిముందు కదిలిన శరీరం
అంతలోనే తుపాకి గుండు మింగి నిర్జీవమై
రంగుల జెండాలతో కప్పబడిన శవ రాజకీయమై
భూమి యిచ్చినా కంచె వేసుకోలేని వృద్ధుడు
భూమి మీద ఆశేలేని వృద్ధురాలు
ఎటు నుండి ఎటోపోతూ
అంతులేని జీవిత ప్రయాణంలో
రోడ్డు పక్కన లారీ ఆపుకొని

పేరు ఊరు తెలియని ధర్నా
చావు దెబ్బతీసింది
ముదిగొండ మృత్యుగుండమై విస్ఫోటించింది
స్తూపాలు కట్టపడవు
సంతాప సభలుండవు
వీరు అమరవీరులుకారు
అమర జవానులుకారు
ఉద్యమాలేవైన పావులయ్యేది దళితులు
పల్లేర్ల బాటలో పండిన పల్లెజీవితాలు
ఎవరు? ఎందుకు? ఏం చేస్తున్నారో? తెలియని
భూమి (మృత్యువు) కౌగిలిలో ఒదిగిపోయిన అమాయకులు

***

(భూపోరాటంలో ఖమ్మం జిలా ముదిగొండ సంఘటన 28 07 2007)

## 51. ఇప్పుడేది అవసరం..?

గూడుకోసం గోడు మొదలయి
గువ్వ గూడొదలి ఎగిరిపోతే
గుండెనిండా పొంగేది కన్నీటి సముద్రాలే
ముదిగొండను మింగింది మృత్యువు అనకొండై
ఉద్యమాలలో విద్రోహకారులు అంటు పాలకులు
పోలీసు జులుం అంటూ ప్రతిపక్షాలు
రాయి ఏదైతేనేం పళ్ళూడినది ప్రజలవే
మెడ మీద తల ఉంటే సంయమనలోపమే
ఎనిమిది మంది ప్రాణాలు మింగిందని
బుర్రబద్దలుకొట్టి అర్థం చెప్తుంది
ప్రాణం పోనిదే ఫలితం దక్కదని శవరాజకీయపు వేదాంతం
ఇది దురదృష్ట సంఘటనెట్లయ్యింది
దూరపు చూపు లోపం కాదా?
ఒక్క అహంకార ప్రవర్తన కారణంకాదా?
ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలే కాదు
మానసికశాస్త్రాల, మానవత్వపు బోధనల అవసరం తెలియటం లేదా?

❋❋❋

(ఖమ్మం జిల్లా ముదిగొండ పోలీసు కాల్పుల గురించి 28 07 2007)

90574

సుందరయ్య గ్రంధాలయం
౧౦574
హైదరాబాద్-500



Jwalitha

Kaalaanni Jayistu Nenu

Poetry

నాకు ఊపిరైన కొన్ని వాక్యాలు

"స్వేచ్ఛ కోసం చేసే అతివాదం కూడా సుగుణమే,
న్యాయం కోసం చేసే మితవాదం కూడా దుర్గుణమే"

- ఆకలి కడుపుకు సిద్ధాంతాలుండవు.

- ఆశలు మాత్రమే అవకాశాలను కల్పించవు.

- స్పష్టమైన లక్ష్యాలు మాత్రమే మనిషిని గమ్యంవైపు నడిపిస్తాయి.

